Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్




RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 251 విశాఖపట్నం, 21 జూలై 2024 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## భక్తుల హర్షధ్వానాలతో కదిలిన పుష్పరథం

### కనుల పండుగలా జరిగిన గిరి ప్రదక్షిణ





విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): సింహాచలం గిరి ప్రదక్షిణ సందర్భంగా తొలిపావంచా వద్ద ఏర్పాటు చేసిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి పుష్పరథం భక్తుల హర్షధ్వానాల మధ్య అంగరంగ వైభవంగా కదిలింది. మాజీ కేంద్ర మంత్రి, ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు శనివారం సాయంత్రం 04.15గం. లకు జెండా ఊపి రథాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్.శ్రీనివాస మూర్తి, స్థానిక కార్పొరేటర్ పీ.వి. నర్సింహం, ఆలయస్థానా చార్యులు డా. టి.పి.రాజ గోపాలాచార్యులు భాగస్వాములయ్యారు. తొలుత ఆలయ స్థానాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్పరథాన్ని ప్రారంభించారు.

ఆషాడ పౌర్ణమి ముందు రోజు గిరిప్రదక్షణను దేవస్థానం నిర్వహించడంతో శనివారం తెల్లవారు జాము నుంచే వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి భక్తులు తండోపతండాలుగా వచ్చి సింహాద్రి అప్పన్నకు నమష్కరించి గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విశిష్టతను సంతరించుకున్న గిరి ప్రదక్షిణకు లక్షలాదిగా భక్తులు తరలి వచ్చారు. గిరి ప్రదక్షిణ సుమారు 32 కి.మీ మేర కొన సాగగా, సింహాచలం నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డు మీదుగా హనుమంతవాక జంక్షన్, తెన్నేటి పార్కు, ఎంవీపీ డబుల్ రోడ్డు, సీతమ్మధార, మాధవ ధార,ఎన్ఏడీ, గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెం, ప్రహ్లాదపురం మీదుగా భక్తులు తిరిగి సింహాచలం కు భక్తులు చేరుకోనున్నారు. గిరిప్రదక్షిణతో సింహగిరి సమీపం లోని అడివివరం గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. విశాఖ వాసులతో పాటు చుట్టు పక్కల జిల్లాలు,ఒడిషా నుంచి కూడా భక్తులు అధిక సంఖ్య లో గిరి ప్రదక్షిణలో పాల్గొనడటంతో సింహగిరులు గోవింద నామస్మరణతో మారుమ్రోగింది.



### సిఎం చంద్రబాబు కార్యాలయంలో

## నలుగురు అధికారులకు శాఖల కేటాయింపు



అమరావతి: ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాలయంలోని నలుగురు అధికారులు పర్యవేక్షించాల్సిన శాఖలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిఎం ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్రకు సిఎం కార్యాలయం, సాధారణ పరిపాలనశాఖ, హెూం, ఆర్థిక, ఎక్సైజ్, రెవెన్యూ, దేవాదాయ శాఖలను కేటాయించారు.ఏవీ రాజమౌళి జలవనరులు, విద్యుత్, గనులు, వ్యవసాయం, సీఎంఆర్ఎఫ్, ఫిర్యాదులు తదితర శాఖలను పర్యవేక్షించనున్నారు. ప్రద్యుమ్నకు రవాణా, పురపాలక, పంచాయతీరాజ్, ఆర్టీజీఎస్, అటవీ, పౌరసరఫరాలశాఖలను కేటాయించారు. కార్తికేయ మిశ్రాకు ఆర్థిక, ఐటీ, ఎన్ఆర్ఐ వ్యవహారాలు, సమాచార పౌరసంబంధాలు, పరిశ్రమలు, సీఎం ఢిల్లీ, విదేశీ పర్యటనల సమన్వయం తదితర విభాగాలను కేటాయించారు.

## ముంబయిలో కూలిన భవనం : ఇద్దరు మృతి



ముంబయి : ముంబయిని వాన ముంచెత్తుతోంది. ఎడతెరిపిలేకుండా కురుస్తోన్న భారీ వర్షాలకు శనివారం ఓ భవనం కూలిపోయింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది వివరాల మేరకు భారీ వర్షాల కారణంగా గ్రాంట్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం ఉదయం 10 గంటల 30 నిముషాలకు ఓ భవనంలోని ఒక భాగం కూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. భవనంలోని ఒక భాగం పూర్తిగా కూలిపోగా, మరికొంత భాగం ప్రమాదకరంగా వేలాడుతూ ఉంది. అగ్నిమాపక సిబ్బంది ఇప్పటివరకు 13 మందిని రక్షించారు. భవనంలోని నివాసితులు శిథిలాల కింద చిక్కుకొని

(మిగతా 2లో)

## నీట్ రిజల్ట్స్ వచ్చేశాయ్



నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్- అండర్ గ్రాడ్యుయేట్ 2024 పరీక్షల ఫలితాలను విడుదల చేసింది. తన అధికారిక వెబ్‌సైట్‌లో వాటిని పొందుపరిచింది. అభ్యర్థులు exams.nta.ac.in/NEET, neet.ntaonline.in వెబ్‌సైట్‌లల్లో వాటిని చెక్ చేసుకోవచ్చు.

ఈ పరీక్షల ఫలితాలను ఈ నెల 20 లోగా ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రకటించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు ఎన్టీఏను ఆదేశించిన విషయం తెలిసిందే. దీనిపై స్వయంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్.. స్పష్టమైన ఆదేశాలను ఇచ్చారు. రాష్ట్రం, సెంటర్ వారీగా వాటిని వెల్లడించాలని అన్నారు. దీనికి అనుగుణంగా ఎన్టీఏ.. ఈ మధ్యాహ్నం నీట్ యూజీ పరీక్షల ఫలితాలను విడుదల చేసింది.

ఇదివరకు ఈ పరీక్షలు ఏ స్థాయిలో వివాదాస్పదం అయ్యాయో తెలిసిందే. పేపర్ లీక్ కావడం, గ్రేస్ మార్కులు కలపడం, ప్రశ్నాపత్రాలను అమ్ముకోవడం వంటి ఆరోపణలతో నీట్ పరీక్షలు అత్యంత వివాదాస్పదం అయ్యాయి. దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. దీనిపై కొందరు విద్యార్థులు సుప్రీంకోర్టు సైతం ఆశ్రయించారు.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. కీలక ఆదేశాలను ఇచ్చింది. అభ్యర్థులు సాధించిన మార్కులను వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని సూచించింది. అలాగే- వారు రాసిన పరీక్ష కేంద్రాలవారీగా ఈ ఫలితాలను వెల్లడించలని పేర్కొంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్టీఏ నీట్ యూజీ ఫలితాలను విడుదల చేసింది.

ఈ ఏడాది మే 5వ తేదీన దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో నీట్ పీజీ పరీక్షలను నిర్వహించింది ఎన్టీఏ. 23.33 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలను రాశారు. అలాగే నీట్ యూజీ రీ-ఎగ్జామ్ కూడా జూన్ 23వ తేదీన కండక్ట్ చేసింది. ఇందులో 1,563 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు.

(మిగతా 2లో)

## ఏపీ వ్యాప్తంగా భారీ వర్షాలు.. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు



అమరావతి: గత రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ఏపీలోని పలు జిల్లాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాను భారీ వర్షాలు ముంచెత్తాయి. విశాఖ జిల్లాలో భారీ వర్షాల కారణంగా విద్యాసంస్థలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు.

అనకాపల్లి జిల్లాలో కల్యాణపులోవ జలాశయం నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. జలాశయం రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. తాండవ జలాశయం ప్రస్తుత నీటిమట్టం 365 అడుగులుగా ఉంది. మరోవైపు తాడిగిరి వంతెన పైనుంచి వరద ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. దీంతో 10 గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. వర్షానికి అనకాపల్లి జిల్లాలో వరినాట్లు కొట్టుకు పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌తో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. అధికారులంతా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మత్స్యకారులెవరూ చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. సహాయ చర్యలకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు.

ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జిల్లాలోని విద్యాసంస్థలన్నింటికి సెలవు ప్రకటించారు.

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం రామరాజుపాలెం వద్ద వంతెనపై వరద ప్రవహిస్తోంది. దీంతో కేడీపేట- చింతపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రాజవొమ్మంగి మండలం ఎర్రంపాడు వద్ద వరద ఉధృతి పెరిగింది. మరోవైపు వట్టిగెడ్డ జలాశయం పొర్లుకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. చింతూరు-కుయుగురు మధ్య వంతెన పై నుంచి వాగు ప్రవహిస్తుండటంతో..ఏపీ, ఒడిశా మధ్య రాకపోకలు తాత్కాలికంగా నిలిచిపోయాయి.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ప్రకాశం బ్యారేజ్‌కు భారీగా వరద పోటెత్తింది.

(మిగతా 2లో)

## కార్యకర్తలకు అండగా ఉంటా : ఎంపి సీఎం రమేష్





అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి మాధవ్ సదన్ లో జరిగిన భారతీయ జనతా పార్టీ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిధిగా అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు ఎంపి సీఎం రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో నా విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేసారు. భాజాపా లో చేరి 5 సంవత్సరాలు అయినప్పటికి భారత దేశంలో ఉన్న ప్రతి భారతీయ జనతా పార్టీ నాయకులు తెలిసే విధంగా పార్టీలో పని చేస్తున్నారు. సొంత గ్రామంలో కూడా పార్టీ ప్రతిష్ఠకు కృషి చేయడం జరిగిందన్నారు . విశాఖపట్నం ఎంపిగా పోటీ చేయాలను కున్నప్పటికి పార్టీ ఆదేశాలకు మేరకు అనకాపల్లి లో పోటీ చేసారన్నారు.పార్టీ శ్రేణులు చేసిన కృషి అభినందనీయంమని కొనియాడారు.


ప్రతి కార్యకర్త మన మన ప్రాంతంలో నాయకునిగా ఎదగడానికి కావలసిన పరిస్థితులను తెలుసుకుని ఎదగడానికి ప్రయత్నం చేయాలన్నారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో మన పార్టీ మార్క్ ను చూపించగలిగే విధంగా ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర పెద్దలు సూచన మేరకు మన అందరూ పని చేయవలసి ఉందన్నారు.పార్టీ గౌరవప్రదమైన స్థానంలో ఉండే టట్లు ప్రయత్నం చేస్తాన్నన్నారు.కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. భాజాపా రాష్ట్ర సంఘటనా కార్యదర్శి నూకల మదుకర్ జీ మాట్లాడుతూ జాతీయ నాయకత్వం పిలుపు మేరకు పార్టీ సభ్యత్వం ప్రతి భూత్ లోను కనిష్టంగా 25 చేయాలని పిలుపునిచ్చారు.

కార్గిల్ యుద్ధంలో పోరాడిన సైనికుల గౌరవార్థం ప్రతి సంవత్సరం జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ జరుపుకోవాలని కార్యకర్తలకు సూచించారు.

ప్రధాని నరేంద్రమోదీ సూచన మేరకు అమ్మ

(మిగతా 2లో)

## కలవర పెడుతున్న కోవిడ్ కేపీ.3 కొత్త వేరియంట్



ప్రపంచవ్యాప్తంగా కరోనా మహమ్మారి పీడ ఇంకా పోలేదు. కొవిడ్? మహమ్మారి మరో కొత్త రూపు దాల్చింది. తాజాగా కేపీ.3 అనే కొత్త వేరియంట్ వెలుగులోకి రావడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. కోవిడ్ కేపీ.3 కొత్త వేరియంట్ ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతోంది. గత కొన్ని వారాలుగా ఈ వేరియంట్‌తో సంక్రమణ కేసులు వేగంగా పెరుగుతున్నాయి.

జపాన్‌లో ఈ వేరియంట్ వేగంగా సంక్రమణ కేసులు పెరిగుతున్నాయి. జపాన్‌లో కోవిడ్ 11 వ వేవ్ ప్రమాదం పొంచి ఉంది. గత నెలలో జపాన్ తోపాటు అమెరికాలో కూడా కరోనా వేరియంట్ FLiRT కేసులు పెరిగాయి. ప్రస్తుతం దేశంలో కరోనా నియంత్రణలో ఉంది. అయితే జపాన్, అమెరికా కోవిడ్ రకాలు భారత దేశంలో వ్యాప్తి చెందుతుందా అన్న ప్రశ్న తలెత్తోంది. ప్రజలకు సోకే ఈ కొత్త వేరియంట్ కేపీ.3 అంటువ్యాధి. ఈ వేరియంట్ కోవిడ్ వ్యాక్సిన్ పొందిన వారికి కూడా సోకుతోంది. కేపీ వేరియంట్ 3 లక్షణాలు మునుపటి వేరియంట్‌ల మాదిరిగానే ఉంటాయి. వీటిలో అధిక జ్వరం, గొంతు నొప్పి, తలనొప్పి, విపరీతమైన అలసట, వాసన, రుచి కోల్పోవడం వంటివి ఉన్నాయి. అయితే, ప్రస్తుతం ఈ వేరియంట్ గురించి పెద్దగా ఏమీ చెప్పలేమంటున్నారు వైద్య నిపుణులు.

అటు కేపీ.3 వేరియంట్ అమెరికాలో వేగంగా విస్తరిస్తోంది. టీకాలు తీసుకున్న లేదా గతంలో ఇన్ఫెక్షన్ నుంచి కోలుకున్న వారికి కూడా ఇప్పుడు ఈ కొత్త వేరియంట్ సోకుతోంది. ఈ వైరస్ పరివర్తన చెందిన ప్రతిసారీ మరింత ప్రమాదకరంగా మారుతోంది. కరోనా నూతన వేరియంట్ వ్యాప్తి విషయంలో

(మిగతా 2లో)

# విశాఖ సమాచారమ్

ఆదివారం 21-07-2024


## నమస్కారం విలువ

మహాభారత యుద్ధ సమయంలో "మీరు పక్షపాతంగా యుద్ధం చేస్తున్నారు" అని దుర్యోధనుడు అనిన వ్యంగ్యమైన మాటలకు బాధపడి భీష్మ పితామహుడు "నేను రేపు పాండవులను చంపుతాను" అని ప్రకటించాడు.

అంతే... పాండవుల శిబిరంలో ఆందోళన పెరిగింది. భీష్ముని సామర్థ్యం గురించి అందరికీ తెలుసు కాబట్టి, చెడు భయంతో కలవరపడ్డారు. అప్పుడు.. శ్రీ కృష్ణుడు తన వెంట ద్రౌపదిని తీసుకొని భీష్ముని శిబిరానికి వెళ్ళాడు.

తను బైటే నిలబడి ద్రౌపదితో "నీవు వెళ్లి భీష్మునికి నమస్కరించు, ఆయన "అఖండ సౌభాగ్యవతీ భవ" అని ఆశీర్వదిస్తాడు. తర్వాత జరిగేది గమనించు అన్నాడు.

ద్రౌపది అలానే చేసింది, భీష్ముడు దీవించి, "ఏంటమ్మా! ఇంత రాత్రి ఒంటరిగా వచ్చారు. నిన్ను కృష్ణుడు తీసుకు వచ్చాడు కదా" అన్నాడు.

దానికి ద్రౌపది "అవును తాతయ్యా.. అన్న శిబిరం బయట నిలబడి ఉన్నారు" అనింది. భీష్ముడు బయటకు వెళ్ళగా.. ఇద్దరూ ఒకరికి ఒకరు నమస్కరించుకున్నారు.

వెంటనే భీష్ముడు.. నాకు తెలుసు కృష్ణా, మీరు ఇలా చేస్తారని. ప్రతిజ్ఞ కన్నా దీవెనకు ప్రభావం ఎక్కువ. నేను పాండవుల జోలికి రాకుండా ఉండేందుకు ఇలా చేయండి అని ఒక మార్గం ఉపదేశించాడు.

శిబిరం నుండి తిరిగి వస్తున్నప్పుడు, శ్రీ కృష్ణుడు ద్రౌపదితో "నీవు వెళ్లి భీష్మునికి నమస్కరించడం ద్వారా నీ భర్తలు జీవితాన్ని పొందారు".

"ఇలాగే.. నీవు ప్రతిరోజూ భీష్ముడు, ధృతరాష్ట్రుడు, ద్రోణాచార్యుడు లాంటి పెద్దలకు నమస్కరిస్తూ ఉండు. అలాగే దుర్యోధనుడు, దుశ్శాసనుడి భార్యలు కూడా ఆ పెద్దలతో పాటు పాండవులకు కూడా నమస్కరిస్తూ ఉంటే బహుశా ఈ యుద్ధం ఆగిపోవచ్చు. ఒక్క నమస్కారానికి అంతటి భాగ్యం కలుగుతుంది" అన్నాడు.

ప్రస్తుతం సమాజంలోని అనేక సమస్యలకు మూల కారణం ఒకరి నొకరు గౌరవించుకోక పోవడం. అహంకారం వదిలి, ఎదుటి వారిని చులకనగా చూడడం వలన అనర్థాలు జరుగుతున్నాయి.

ఇంటిలోని పిల్లలు మరియు కోడళ్లు ప్రతిరోజూ ఇంటి పెద్దలకు నమస్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకుంటే ఆ ఇంటిలో ఎలాంటి ఇబ్బంది ఉండదు. పెద్దల ఆశీర్వాదాలు కవచం లాగా పనిచేస్తాయి.

ఎందుకంటే...

నమస్కారం ప్రేమ.

నమస్కారం క్రమశిక్షణ.

నమస్కారం చల్లదనం.

నమస్కారం గౌరవాన్ని నేర్పుతుంది.

నమస్కారం మంచి ఆలోచనలను ఇస్తుంది.

నమస్కారం సంస్కారాన్ని నేర్పుతుంది.

నమస్కారం కోపాన్ని తొలగిస్తుంది.

నమస్కారం కన్నీళ్లను కడిగివేస్తుంది.

ఎక్కడ సజ్జన సాంగత్యం లభిస్తుందో అక్కడ ప్రతిభ ఇనుమడిస్తుంది.

# సీజనల్ వ్యాధులతో జిల్లాలో ఏ ఒక్కరూ మరణించకూడదు



**విజయనగరం:** జిల్లాలో సీజనల్ వ్యాధుల వలన ఏ ఒక్కరూ మరణించకూడదని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఈ విషయం లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియం లో సీజనల్ వ్యాధులు, పారిశుధ్యం పై ఎం.పి.డి.ఓ లు, మెడికల్ అధికారులు, ఈ.ఓ.పి.ఆర్.డి లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఓ పి ఆర్ డి లు రెండు రోజుల్లో పంచాయతి కార్యదర్శులతో గ్రామాల వారీగా సమీక్షించి పారిశుధ్యం మెరుగుదలకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. గతవారం జరిగిన గ్రామ సందర్శన లో పారిశుధ్యం పైనే ఎక్కువ ఫిర్యాదులు అందాయని, వచ్చే గ్రామ సందర్శన నాటికి వాటన్నిటినీ పరిష్కరించాలని ఆదేశించారు. ఎవరైనా నోడల్ అధికారి ఏ కార్యదర్శి పైన ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో పర్యటించి వర్షాకాలం అయినందు న పైప్ లీకేజీలను గుర్తించి బాగు చేయడం, నీటి నిల్వలు లేకుండా చూడడం వంటి పనులు తక్షణమే జరగాలని తెలిపారు.

డెంగు, మలేరియా వంటి వ్యాధులు ప్రబల కుండ ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. మండల స్థాయి లో మెడికల్ అధికారులు, ఎం పి డి ఓ లు, ఈఓపిఆర్డిలు సమీక్షించాలని, గ్రామ స్థాయి లో అమలు జరపాలని గ్రామ స్థాయి లో సచివాలయ సిబ్బంది ద్వారా ప్రతి గ్రామం లో విస్తృతంగా అవగాహన కలిగించాలని అన్నారు. ఏయే వ్యాధులు ఎలా వస్తాయి, రాకుండా ఉండాలంటే ఏమేం చేయాలి, వస్తే ఎలాంటి పరీక్షలు చేయించుకోవాలి, ఎలా ఎదుర్కొనాలి అనే అంశాల పై స్పష్టంగా వివరించాలని తెలిపారు. మండల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయి సందర్శనలు చేయాలని, అప్పుడే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని అన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో శత శాతం ప్రసవాలు జరిగేల వైద్యులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్నిరకాల వసతులు, సౌకర్యాలు, వైద్యులు ఉన్నప్పటికీ ప్రైవేటు ఆసుపత్రులకు ఎందుకు వెళ్తున్నారని వైద్యుల్ని ప్రశ్నించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రైవేటు ఆసుపత్రులకు, విశాఖపట్నం కు వెళ్ళకుండా వారిని చూసుకోవాలని, వైద్యులు నమ్మకం కలిగించేలా పని చేస్తే బయటకు వెళ్ళరని తెలిపారు.

ఈ సమావేశం లో డి.ఎం.హెచ్.ఓ డా.భాస్కర రావు మాట్లాడుతూ వ్యాధుల నియంత్రణకు కృషి చేస్తామని, డి.సి.హెచ్ ఎస్ డా.గౌరీ శంకర రావు మాట్లాడుతూ ఇన్స్టిట్యూషనల్ డెలివరీలను పెంచుతామని తెలిపారు. డి.పి.ఓ శ్రీధర్ రాజా మాట్లాడుతూ క్లోరినేషన్ చేసి, సానిటేషన్ డ్రైవ్ ను నిర్వహించి, డ్రై డే లను పాటించడం ద్వారా పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తామని తెలిపారు.

# ఏఐ హబ్స్‌గా అమరావతి, విశాఖ

**అమరావతి:** అట్టడుగు స్థాయి వ్యక్తి జీవితాన్ని మార్చేలా ప్రభుత్వ విజన్ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 'రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యూనివర్సిటీ ఏర్పాటుచేయాలనే ఆలోచనతో ఉన్నాం. రానున్న రోజుల్లో ఏఐతో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయి. అమరావతి, విశాఖలను ఏఐ హబ్స్‌గా రూపొందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలతో పాటు, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా విధానాలు ఉండాలి. సీమలో హార్టికల్చర్ ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వస్తే రైతులు లబ్ధి పొందుతారు. ప్రతి సామాన్యుడికీ ఫలాలు అందాలి. రాష్ట్రస్థాయి నుంచి మండల, కుటుంబస్థాయి వరకు ఒక యూనిట్‌గా ప్రణాళికలు రూపొందించాలి. అప్పుడే విజన్ డాక్యుమెంట్‌కు సార్థకత చేకూరుతుంది' అని వ్యాఖ్యానించారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047 విజన్ డాక్యుమెంట్‌పై నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం, సంస్థ ప్రతినిధులతో సచివాలయంలో సీఎం చంద్రబాబు శుక్రవారం సమావేశమయ్యారు. వికసిత్ భారత్ -2047కు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లే వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047కు విజన్ డాక్యుమెంట్ తయారుచేయడంపై, రానున్న రోజుల్లో రాష్ట్రాభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రాజెక్టులపై వారితో చర్చించారు. తన అనుభవాలు, నిర్ణయాలు, వాటి ఫలితాలు, భవిష్యత్ ఆలోచనలను పంచుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు.

**విద్యుత్తురంగంలో అనూహ్య మార్పులు**

'ఉమ్మడి రాష్ట్రంలో సంస్కరణలు, విజన్‌తో వచ్చిన ఫలితాలు మనం చూశాం. నేడు వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం విజన్ 2047 సిద్ధం చేసుకుని ప్రయాణం సాగించాలి. టెక్నాలజీని ఉపయోగించుకుని పేదరికం లేని సమాజం సాధించాలి. జనాభా సమతుల్యతపై లోతైన కసరత్తు చేసి ప్రణాళిక రూపొందించాలి. రాష్ట్ర ప్రగతిలో కీలకమైన విద్యుత్ రంగంలో రానున్న రోజుల్లో అనూహ్య మార్పులు వస్తాయి. వాటికి అనుగుణంగా వ్యవస్థలను, ప్రజలను సిద్ధం చేయాలి. మానవ వనరుల నైపుణ్యం పెంచేలా చర్యలు తీసుకోవాలి. దీనికోసం పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీ వరకు సిలబస్ రూపొందించాలి' అన్నారు.

**సంపద సృష్టికి దోహదపడే పాలసీలకు ప్రాధాన్యం**

'కొత్త టెక్నాలజీని, అవకాశాలను అందిపుచ్చుకునే విధానాలు విజన్ డాక్యుమెంట్‌లో ఉండాలి. సంపద సృష్టికి దోహద పడే పాలసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఐఐటీ, ఐఐఎం, ఐఎస్‌బీ వంటి సంస్థలు, మేధావులు, నిపుణులతో చర్చించి డాక్యుమెంట్ రూపొందించాలి. గ్రామీణులకూ ఫలితాలు అందేలా విజన్ ఉండాలి' అని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో వికసిత్ ఆంధ్రప్రదేశ్ విజన్ డాక్యుమెంట్‌పై మరిన్ని సమావేశాలు, సమాలోచనలు జరిపి దాన్ని విడుదల చేయాలని సీఎం నిర్ణయించారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యూపీఎస్సీ ఛైర్మన్ రాజీనామా

దిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ మనోజ్ సోనీ తన పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక వర్గాలు శనివారం వెల్లడించాయి. గతేడాది ఏప్రిల్ నెలలోనే బాధ్యతలు చేపట్టిన ఆయన.. ఇంకా ఐదేళ్ల పదవీకాలం ఉండగానే అనూహ్యంగా రాజీనామా చేయడం గమనార్హం. ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్ వివాదం వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

అయితే, ఈ వివాదంతో మనోజ్ సోనీ రాజీనామాకు ఎటువంటి సంబంధం లేదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. దాదాపు పదిహేను రోజుల క్రితమే ఆయన తన రాజీనామాను రాష్ట్రపతికి సమర్పించినట్లు పేర్కొన్నాయి. అయితే, దీన్ని ఇంకా ఆమోదించలేదని సదరు వర్గాలు తెలిపాయి. 2017లో యూపీఎస్సీ కమిషన్‌లో సభ్యుడిగా చేరి గతేడాది మే నెలలో ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు.

**పూజా ఖేడ్కర్‌పై ఫోర్జరీ కేసు**

2029 మే 15 వరకు ఆయన పదవీకాలం ఉంది. అయితే, ఛైర్మన్ పదవి చేపట్టడానికి ఆయన ముందునుంచి సుముఖంగా లేరని సమాచారం. తనను ఈ బాధ్యతల నుంచి రిలీవ్ చేయాలని గతంలోనే ఓసారి అభ్యర్థించినట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఇకపై, ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించాలని సోనీ కోరుకుంటున్నట్లు తెలిపాయి. యూపీఎస్సీ ఛైర్మన్ పదవికి ముందు ఆయన గుజరాత్‌లోని డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో వరుసగా రెండుసార్లు వీసీగా సేవలందించారు. అఖిలభారత సర్వీసులైన ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్, తదితర ఉద్యోగులను ఎంపిక చేసేందుకు యూపీఎస్సీ ఏటా సివిల్స్ సర్వీసెస్ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ పరీక్షతోనే ఐఏఎస్‌కు ఎంపికైన ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్ ఇటీవల అధికార దుర్వినియోగం, అవకతవకలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టిన యూపీఎస్సీ ఆమెకు శుక్రవారం షోకాజ్ నోటీసు జారీ చేసింది.

## (మొదటి పేజీ తరువాయిలు)

**ముంబయిలో కూలిన భవనం : ఇద్దరు మృతి**

ఉంటారని, వారిని బయటకు తీయడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం సహాయకచర్యలు కొనసాగుతున్నాయి.

**నీట్ రిజల్ట్స్ వచ్చేశాయ్: సెంటర్ల వారీగా: లింక్ ఇదే**

exams.nta.ac.in/NEET వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు తమ మార్క్ కార్డ్‌ను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. వెబ్‌సైట్ హోమ్‌పేజీకి వెళ్లిన తరువాత అక్కడ కనిపించే NTA NEET UG 2024 results అనే అక్షరాలు ఉన్న చోట క్లిక్ చేయాలి. ఆ వెంటనే మరో విండో ఓపెన్ అవుతుంది. అందులో ఇచ్చిన వివరాలను పొందుపర్చాలి. అనంతరం సబ్మిట్ బటన్‌ను క్లిక్ చేయాలి. నీట్ రిజల్ట్స్ వెల్లడవుతాయి. ఫలితాలను తెలుసుకోవడానికి neet.ntaonline.in, ntaresults.nic.in, nta.ac.in అనే వెబ్‌సైట్ అందుబాటులో ఉన్నాయి.

**ఏపీ వ్యాప్తంగా భారీ వర్షాలు.. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు**

బ్యారేజ్ నుంచి కాల్వల ద్వారా 3 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వర్షాల కారణంగా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

పులిచింతల ప్రాజెక్టుకు క్రమంగా వరద పెరుగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం వంద అడుగులకు చేరుకుంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు వరి పంట నీటిలోనే నానుతోంది. కోనసీమ, కాకినాడ జిల్లాల్లో 12 వేల హెక్టార్లకుపైగా వరి నాట్లు నీటమునిగాయి.

రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో వరద ప్రవాహం నిలకడగా ఉంది. ధవళేశ్వరం కాటన్ ఆనకట్ట వద్ద 7.8 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాల్వలకు 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సముద్రంలోకి 3 లక్షల 9 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

తూర్పు గోదావరి జిల్లాలోని గండి పోచమ్మ అమ్మవారి ఆలయం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. అమ్మవారి ఆలయం గోపురం వరకు వరద నీరు చేరింది. అమ్మవారి ఆలయం వద్ద ఇళ్లు పూర్తిగా నీట మునిగాయి. వరద పెరుగుతున్న నేపథ్యంలో అమ్మవారి దర్శనాలు పూర్తిగా నిలిపివేశారు. ఆ ఆలయం నుంచి పాపికొండల విహారయాత్ర నిలిచిపోయింది.

**కార్యకర్తలకు అండగా ఉంటా : ఎంపి సీఎం రమేష్**

పేరుతో ఒక మొక్క వేయాలని కార్యకర్తలకు మదుకర్ జీ సూచించారు.

ఏ సమస్యలు ఉన్న జిల్లా అధ్యక్షులు ద్వారా ఎంపి సీఎం రమేష్ సహాయంతో పరిష్కారానికి కృషిచేయాలని కోరారు.అనంతరం ప్రధాని సూచన మేరకు అమ్మ పేరుతో మొక్క ను సీఎం రమేష్ నాటారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వరావు,శ్రీరామమూర్తి,సురేంద్రమోహన్,పుట్టాగంగయ్య, పొన్నగంటి అప్పారావు,వర్మ ,కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

**కలవర పెడుతున్న కోవిడ్ కేపీ.3 కొత్త వేరియంట్**

రాబోయే వారాలు చాలా కీలకం. ప్రస్తుతం ఆసుపత్రుల్లో కొవిడ్ బాధితులు గణనీయంగా పెరుగుతున్నారు. అమెరికా జూలై 1 నుంచి 7వ తేదీ వరకు వివిధ ఆసుపత్రులలో రోజుకు సగటున 30 ఇన్ఫెక్షన్ కేసులు నమోదయ్యాయి. దీంతో వైద్య సదుపాయాలు, పడకల కొరత విషయంలో ఆందోళన తలెత్తుతోంది.

తాజాగా జో బైడెన్ కూడా కరోనా బారిన పడ్డారు.. అయనలో ఈ కరోనా కేపీ.3 వేరియంట్ లక్షణాలు కనిపించినట్లు తెలుస్తోంది. కరోనా కేపీ.3 వేరియంట్ వేగంగా విస్తరిస్తోంది. వేరియంట్ విషయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు

మొదట్లో కోవిడ్ చైనాలోని వుహాన్‌లో మొదలై క్రమంగా ప్రపంచమంతటా వ్యాపించింది. ప్రస్తుతం భారతదేశంలో పరిస్థితి చాలావరకు నియంత్రణలో ఉన్నప్పటికీ, కొత్త వేరియంట్‌ల వల్ల కరోనా వేవ్ వచ్చే ప్రమాదం ఎక్కువగా లేనప్పటికీ, జాగ్రత్తగా ఉండవలసి ఉంటుంది. దేశంలో ఈ వేరియంట్ కేసులు కనిపిస్తే, వాటిని సకాలంలో నియంత్రించాల్సి ఉంటుంది. దీనితో, ఈ వేరియంట్ కనీస సంఖ్యలో వ్యక్తులకు సోకుతుంది. కోవిడ్ కొత్త రకాలు ఎప్పటికప్పుడు వస్తూ ఉంటాయి. భవిష్యత్తులో కూడా ఇది జరుగుతూనే ఉంటుంది. దీన్ని నివారించడం చాలా ముఖ్యం అంటున్నారు వైద్య నిపుణులు.

**పంచాంగం**

ఆదివారం 21-07-2024

క్రోధి నామ సంవత్సరము

దక్షిణాయణం, గ్రీష్మరుతువు

ఆషాఢ మాసం

| | |
|---|---|
| తిథి | : శు. పూర్ణిమ సా. 04.12 |
| నక్షత్రం | : ఉత్తరాషాఢ రా. 01.52 |
| వర్జ్యం | : ఉ. 10.14 ల 11.47 |

## 350 ఏళ్ల తర్వాత భారత్‌కు ఛత్రపతి శివాజీ రహస్య ఆయుధం

**ముంబయి:** మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ ఉపయోగించిన రహస్య ఆయుధం 'వాఘ్ నఖ్' (పులి పంజా 350 ఏళ్ల తర్వాత భారత్‌కు చేరింది. బుల్లెట్‌ప్రూఫ్ కవర్‌లో, భారీ సెక్యూరిటీ మధ్య దీన్ని మహారాష్ట్ర ప్రభుత్వం భారత్‌కు తీసుకొచ్చింది. సతారాలోని ఛత్రపతి శివాజీ మ్యూజియంలో దీన్ని ఉంచారు. ఈ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే , డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ ఇతర నాయకులు తరలివచ్చారు. సతారాలో ఏడు నెలల పాటు 'వాఘ్ నఖ్'ను ప్రదర్శనకు ఉంచనున్నారు. ఇన్నాళ్లుగా లండన్‌లోని అల్బర్ట్ మూజియంలో ఈ ఆయుధం ఉంది. ప్రజలకు చూపించాలని సంకల్పించిన మహారాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన మూడేళ్ల పాటు ఉంచుకునేందుకు ఆ దేశంతో ఒప్పందం కుదుర్చుకుంది.

చరిత్ర ప్రకారం.. 1649లో ఛత్రపతి శివాజీ బీజాపుర్ సుల్తాన్‌ను ఓడించి మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించాడు. అంతకుముందు బీజాపుర్ సేనాధిపతి అఫ్జల్ ఖాన్‌తో సమావేశమైన శివాజీ రహస్యంగా దాచుకున్న ఈ వాఘ్ నఖ్‌ను ఉపయోగించి అతడిని అంతమొందించాడు. ఈ ఘటన ప్రతాప్‌గఢ్ కోటలో జరిగింది. ఇది ప్రస్తుతం సతారాలో ఉంది. అందుకే ఈ ఆయుధాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడికి తీసుకొచ్చింది.

ఇక ఈ ఏడాది చివరలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే శివసేన (శిందే వర్గం)కు ఈ అంశం ఎన్నికల్లో కలిసివస్తుందని నేతలు భావిస్తున్నారు. శివసేన వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రే వారసత్వాన్ని తామే ముందుకు తీసుకెళుతున్నట్లు సీఎం ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని వర్గం భావిస్తున్న వేళ.. శివాజీ చిహ్నమైన ఈ ఆయుధం తమ విశ్వసనీయతను మరింత బలోపేతం చేస్తుందని పేర్కొంటున్నారు.

## దేవుడి ప్రతినిధులం మాత్రమే'.. సీపీఆర్‌తో ప్రాణం నిలిపిన వైద్యురాలు

దిల్లీ: దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రాణాపాయంలో ఉన్న వృద్ధుడికి సీపీఆర్ చేసి ప్రాణం నిలిపిన వైద్యురాలి వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. వైద్యురాలి ప్రయత్నం ఫలితంగా బాధిత వృద్ధుడు మళ్లీ ఊపిరి పీల్చుకోవడంతో ఆమెను 'హీరో డాక్టర్'గా పేర్కొంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ క్రమంలో సదరు వైద్యురాలు స్పందిస్తూ.. వృత్తి ధర్మాన్ని మాత్రమే పాటించామని, కేవలం తాము దేవుడి ప్రతినిధులం మాత్రమేనన్నారు.

రాజస్థాన్‌లోని అజ్మీర్‌కు చెందిన డాక్టర్ ప్రియా దంపతులు.. దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని లాంజ్‌లో కూర్చున్నారు. అదే సమయంలో 60 ఏళ్లు పైబడిన ఓ వృద్ధుడు గుండెపోటుతో ఉన్నట్టుండి కుప్పకూలారు. ఇది చూసిన డాక్టర్ ప్రియా వేగంగా స్పందించి.. అతడి ఛాతీపై గట్టిగా నొక్కుతూ సీపీఆర్ (హృదయ శ్వాసకోశ పునరుజ్జీవనం) చేశారు. ఆమె కృషి ఫలించి సరిగ్గా ఐదు నిమిషాల తర్వాత ఆ పెద్దాయన స్పృహలోకి వచ్చారు. ఇలా ఆ వ్యక్తిని కాపాడిన తీరును ఆమె మీడియాకు వెల్లడించారు.

"భగవంతుడి స్థానాన్ని ఎవ్వరూ భర్తీ చేయలేరు. మేం కేవలం దేవుడి ప్రతినిధులం మాత్రమే. ఆయన ఆజ్ఞ ప్రకారమే ఏదైనా చేయగలం. అమర్‌నాథ్ యాత్ర నుంచి తిరిగి వస్తున్న సమయంలో మా విమానం రెండున్నర గంటల ఆలస్యమైంది. అదే సమయంలో మా పక్కన ఓ వ్యక్తి పడిపోవడాన్ని చూశాం. నా భర్త డాక్టర్ రమాకాంత్‌తోపాటు మరో ఇద్దరు వైద్యులు కూడా మాతో ఉన్నారు. అప్పటికే ఆయన శ్వాస పూర్తిగా ఆగిపోయింది. దాంతో వెంటనే సీపీఆర్ చేశాం. ఐదు నిమిషాల తర్వాత అతను కొద్దిగా స్పందించాడు. సీపీఆర్‌ను అలాగే కొనసాగించడంతోపాటు ఎయిర్‌పోర్ట్ సిబ్బందిని అప్రమత్తం చేశాం. ఆయన భార్యకూ సమాచారమిచ్చాం" అని డాక్టర్ ప్రియా వెల్లడించారు.

## నాకు కేంద్ర మంత్రి తెలుసు..'

**టికెట్ లేని ప్రయాణికుడి సమాధానానికి షాకైన టీటీ**

మథుర: యూపీలోని మథుర జంక్షన్‌లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి చెప్పిన సమాధానం రైల్వే టీటీని షాక్‌కు గురిచేసింది. తనకు కేంద్రమంత్రి తెలుసని అతడు చెప్పడం అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురి చేసింది.

ధోలాపుర్ నుంచి వస్తున్న ఓ ప్రయాణికుడిని మథుర రైల్వే స్టేషన్‌లో టీటీ ఆపి టికెట్ చూపించాల్సిందిగా కోరాడు. ఆ ప్రయాణికుడి వద్ద టికెట్ లేదు సరికదా.. తనకు కేంద్ర మంత్రితోపాటు పలువురు ప్రముఖులు తెలుసంటూ సమాధానం చెప్పాడు. దీంతో టీటీ వారితో మాట్లాడించాల్సిందిగా అతడిని కోరారు. దీంతో ఆ మినిస్టర్ తనను గుర్తుపడతారో, లేదో అంటూ ఆ ప్రయాణికుడు చెప్పిన సమాధానానికి అక్కడున్న వారంతా నవ్వుకున్నారు. అనంతరం టీటీ ఆ ప్రయాణికుడికి నిబంధనల ప్రకారం జరిమానా విధించారు.

టికెట్ లేకుండా ప్రయాణించే వారే లక్ష్యంగా మథుర జంక్షన్‌లో రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 89 మంది ప్రయాణికుల నుంచి రూ.33,325 జరిమానా రూపంలో వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.

# పారిశుధ్యం మెరుగుపరచాలి ప్రజల ఆరోగ్యం పై జాగ్రత్త వహించాలి: జిల్లా అధికారి



**చోడవరం, (విశాఖ సమాచారమ్):** గ్రామపంచాయతీలో జిల్లా పంచాయతీ అధికారి శిరీష పర్యటించారు పారిశుధ్యం ఇంకా మెరుగుపరచాలని రోడ్లపై చెత్త వేయరాదని ఎప్పటికప్పుడు పంచాయతీ సిబ్బంది తొలగించాలని తెలిపారు చీడికాడ రోడ్డులో గల నరసరా చెరువు, నూకాలమ్మ గుడి ఏరియా, బాలాజీ నగర్, చిన్న బజార్ ఏరియాలలో పర్యటించారు త్రాగునీరు వీధి విద్యుత్ దీపాలు శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని నిల్వ ఉంచిన మాంసాహారాలు తినవద్దని ఇంటి చుట్టూ మీరు నిలవ, కాళీ కొబ్బరి బొండాలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు వర్షాలు పడుతున్న కారణంగా రోడ్లకు ఇరువైపులా మొక్కలు విపరీతంగా పెరుగుతున్నాయని వాటిని పూర్తిగా తొలగించాలని తెలిపారు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని ఏర్పరచాలని ప్లాస్టిక్ పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఈవో పీఆర్డి చైతన్య పంచాయితీ కార్యనిర్వహణ అధికారి నారాయణరావుకు సూచించారు ప్రజలందరూ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని లేని పక్షంలో డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని ఈ వ్యాధుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు అలాగే ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు త్రాగాలని సూచించారు అనంతరం తామరచెరువు వీధిలో గల వర్మీ కంపోస్ట్ ను పరిశీలించారు ఇంటింటికి తిరిగి తడి చెత్త పొడి చెత్తను తీసుకువచ్చి వర్మీ కంపోస్టు ను తయారు చేసే విధంగా మెరుగైన చర్యలు తీసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో డిపిఆర్సి కన్వీనర్ నాగలక్ష్మి పంచాయతీ మెంబర్ శ్రీనివాస్, చిన్నారావు, ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, కార్తీక్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏఎంఏ ఎల్ కళాశాలలో ముగిసిన నాక్ పర్యటన



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక ఏ ఎం ఏ ఎల్ కళాశాలలో నాక్ బృందం ఈనెల 18 మరియు19 తారీకులలో సందర్శించి వారి సలహాలు ఉన్నటువంటి రిపోర్టును ఎగ్జిట్ మీటింగ్ లో సమర్పించడం జరిగినది ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయ బాబు తెలియజేశారు.

వారు గత రెండు రోజులుగా కళాశాలను సందర్శించి ప్రతి డిపార్ట్మెంట్ ను క్షుణ్ణంగా పరిశీలించారనీ, మొదటి రోజు కొన్ని పరిశీలనలు పూర్తి అయిన తర్వాత కళాశాల పూర్వ విద్యార్థులతోను మరియు స్టాఫ్ తోను మీటింగ్ ఏర్పాటు చేసి మాట్లాడటం జరిగిందనీ రెండవ రోజు మిగిలిన విభాగాలను సందర్శించి వారి సూచనలు మరియు సలహాలు ఉన్నటువంటి రిపోర్టును సమర్పించడం జరిగినది ప్రిన్సిపాల్ తెలియజేశారు. నాక్ బృందం పరిశీలన పూర్తయిన తర్వాత వారిచ్చిన సమాచారం మేరకు బెంగళూరు ప్రధాన కార్యాలయం వారు ర్యాంకు కేటాయిస్తారని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాక్ విషయంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ముఖ్యంగా కళాశాలను సుందరంగా తీర్చిదిద్దిన మేనేజ్మెంట్ వారికి, వర్తక సంఘ ప్రముఖులకు, నాక్ బృందానికి రికార్డ్ ప్రతులను సమర్పించడానికి వర్క్ చేసిన టీచింగ్ మరియు నాన్ టీచింగ్ స్టాఫ్ అందరికీ, అలాగే కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులకు, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా తగిన సూచనలు సలహాలు అందించిన నక్కపల్లి గవర్నమెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్యకి కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# వ్యాస పూర్ణిమ , గురుపౌర్ణమి

మనందరిలోనూ పవిత్రమయిన హృదయం ఉంది. కాని చీకటి అనే అజ్ఞానంతో మనసంతా చెడు ఆలోచనలతోనూ , దుర్గుణాలతోను నిండిపోవడం వల్ల దానిని గుర్తించలేక పోతున్నాము. మన అజ్ఞానం ఎంతంటే? దీపం వెలిగించ మన్నప్పుడు నీటికీ , నూనెకు తేడా తెలియనట్టు వంటి చీకటి స్థితిలో ఉన్నాము. మరి ఈ చీకటి స్థితి నుంచి బయటపడి జ్ఞానదీపాన్ని వెలించు కోవాలంటే మంచి సద్గురువు చాలా అవసరం.

**గురువు అంటే** :- గురువు అంటే బ్రహ్మ , విష్ణు , మహేశ్వరులు ఒకటై జన్మించిన రూపం అంటే సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపమే గురువు. గు అంటే అంధకారము లేదా అజ్ఞానాన్ని , రు అంటే నిరోధించుట లేక నశింప చేయుట అని గురువు అంటే అజ్ఞానాన్ని నశింప చేయువారు అని అర్ధము. గు **శబ్దమంధకారస్యరుతన్నిరోధకః** అని పెద్దల వచనం! గురువు చేయవలసినది తన శిష్యులను అంధకారంలోంచి వెలుగులోకి తీసుకు రావడం. ఈ భౌతిక జగత్తులో ఏ మానవుడూ సంసారయాతనలు అనుభవించకుండా చూడటం ఆ గురువు కర్తవ్యం.

ఆ గురువు సాన్నిధ్యంలో కామ క్రోధ , లోభ , మోహ , మద , మాత్సర్యాలు అనే దుర్గుణాలను , అహంకారాన్ని విడిచిపెట్టి ధ్యాన సాధన చేస్తే హృదయం పవిత్రమవుతుంది. అప్పుడు ఆ పవిత్ర మైన హృదయంలో జ్ఞానమనే దీపం వెలిగించుకోవడం సాధ్యమవుతుంది.

విజ్ఞానానికి మూలం విద్య. ఆ విజ్ఞానాన్ని నేర్పేవాడే గురువు. అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానాన్ని అందించే గురువుని ఎప్పుడూ గౌరవించాలి.ఒకప్పుడు గురు కులాలుండేవి. వాటిలో చేరిని విద్యార్థులకు తల్లీ తండ్రీ అన్నీ తామే అయ్యేవారు గురువులు. మాతృదేవోభవ , పితృదేవోభవ , ఆచార్యదేవోభవ అంటారు. తల్లీ తండ్రీ తరువాత స్థానం గురువుదే.

**"గురుర్బ్రహ్మ, గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః"**

దైవోపచారం చేస్తే గురువైనా రక్షిస్తాడు. అదే గురువుకు కోపం వస్తే ముల్లోకాలలో ఎవరూ రక్షించలేరట. అందుకే సమస్త విద్యలను నేర్పే గురువుకు , జ్ఞనాన్ని అందించే గురువుకు సేవచేసి , గురుకృప పొంది మహనీయు లైనవారు ఎందరో వున్నారు.

గురువునూ, గోవిందుడిని పక్కనపెట్టి ముందు ఎవరికి నమస్కారం చేస్తావంటే, గురువుకే నమస్కరిస్తాను. కారణం గోవిందుడు వున్నాడని చెప్పింది గురువేకదా" అంటాడు భక్త కబీర్ దాస్. అదీ మన భరతీయసంస్కృతి ఆర్షధర్మం నేర్పిన గురువు యొక్క ప్రాముఖ్యం. కాబట్టి గురుపౌర్ణమినాడు ప్రతి ఒక్కరూ గురువుల్ని సేవించాలి.

గురు పూర్ణిమ విశిష్టత :-

**వ్యాసం వసిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమకల్మషమ్ !**
**పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్ !!**
**వ్యాసాయ విష్ణు రూపాయ వ్యాసరూపాయ విష్ణవే !**
**నమో వైబ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః !!**

ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున వ్యాస మహర్షి జన్మ తిథి అయిన గురు పూర్ణిమ గా మనం జరుపుకుంటాం. ఈ రోజున గురుపూజోత్సవం జరిపి గురువులకు కానుకలు బహుమతులు సమర్పించి వారిని సత్కరించి వారి ఆశీర్వాదములు తీసుకొంటారు. తమ జీవితానికి మార్గనిర్దేశం చేసి, ముక్తి వైపు నడిపించినందుకు ప్రతిఫలంగా ఇలా చేస్తారు.

గురువుల పట్ల ఇదే గౌరవం అన్నివేళలా పాటిస్తున్న ప్పటికీ ఈ రోజు వ్యాసమహాముని పుట్టిన రోజు కాబట్టి దీనికంత ప్రాధాన్యత ఉంది. గురువు అంటే ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించేవాడు. చాలామంది హిందువులు తమ గురువులతో జీవితాంతం అనుబంధం ఏర్పరుచుకుని ఉంటారు. ఇది కుటుంబ సంబంధం కూడా కావచ్చు. తర తరాలకూ కొనసాగవచ్చు.

సనాతన ధర్మంలో గురువును భగవంతునికి భక్తునికి మధ్య సంధాన కర్తగా భావిస్తుంటారు. వేదవ్యాసుని మానవజాతి కంతటికి మంచి ఆధ్యాత్మిక వారసత్వాన్ని మిగిల్చి వెళ్ళారు కాబట్టి ఆయనను మానవాళికంతటికీ గురువుగా భావిస్తుంటారు. వేదవ్యాసుని పూర్వనామం లికృష్ణ ద్వైపాయనుడు. వేదకాలపు సంస్కృతినంతా నాలుగు వేదాల్లో ఆయన సంకలనం చేసిన తరువాత ఆయన్ను వేదవ్యాసుడిగాలి పిలవడం ప్రారంభించారు.

లోకానికంతటికీ జ్ఞానాన్ని అందించిన గురువు వ్యాసుడు కాబట్టి వ్యాసుని జన్మ తిథిఅయిన ఆషాఢ శు ద్ధ పూర్ణిమను గురు పూర్ణిమగా జరుపుకోవడం ఆచారమైంది. మామూలు రోజులలో కన్నా ఈ వ్యాస పూర్ణిమ నాడు గురువు నుండి వెలువడే ఆశీర్వచనాలు వేయి రెట్లు ఎక్కువగా పొంద వచ్చుట.. అందుకే ఈ రోజు గురుపూజోత్సవం లో పాల్గొని గురువు కరుణా కటాక్షములను పొందవచ్చు..

గురు అనే పదంలో 'గు' అనే అక్షరం అంధకారాన్ని 'రు' అనే అక్షరం వెలుగును సూచిస్తాయి..

**జ్ఞానశక్తి సమారూఢః తత్త్వమాలావిభూషితః ।**
**భుక్తిముక్తి ప్రదాతా చ తస్మై శ్రీ గురవే నమః ॥**

శిష్యునిలో అజ్ఞానాంధకారాలను తొలగించే బాధ్యతను గురువు తీసుకుంటాడు.. కాబట్టి... గురువుకే ప్రథమ స్థానమునిచ్చారు.. మాతా, పిత, గురువులలో జన్మనిచ్చిన వారి ప్రక్కన గురువుకి అత్యంత విశిష్టమైన స్థానాన్ని కల్పించినది ఇందుకే...

అలానేఈ రోజు తప్పకుండా ఈ శ్లోకం స్మరించుకోవాలి.

**నమోస్తుతే వ్యాస విశాల బుద్ధే పుల్లార విందాయత పత్రనేత్ర ।**
**వినత్వయా భారత తైల పూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమాయః ప్రదీపః ॥**
**న గురోరధికం తత్త్వం న గురోరధికం తపః ।**
**తత్త్వనాత్పరం నాస్తి తస్మై శ్రీగురవే నమః ॥**
**('గురువును మించిన తత్వం తపస్సు జ్ఞానం వేరొకటి లేవు')**

గురుపౌర్ణమినాడు వ్యాసులవారు రచించిన ఏ గ్రంథం చదివినా, చాలామంచిది. గురుపీఠానికి ఆద్యులైన నారాయణుడిని, సదాశివుడిని, బ్రహ్మదేవుడిని, వసిష్ఠుల వారిని, శక్తిమునిని,పరాశరుడిని,వ్యాసులవారిని,శుక మహాముని ని,గౌడపాదులవారిని, గోవింద భగవత్పాదులను, శంక రాచార్యులవారిని ఈ రోజు పూజిస్తే విశేషఫలం లభిస్తుంది. అంతేకాదు తమ గురువులను కూడా ప్రతి ఒక్కరూ ఈ రోజున గౌరవించి పూజించాలి.

**వ్యాస పూర్ణిమ గురుపూర్ణిమ**

నిజానికి వ్యాసుడు అనేది ఒక పదవి పేరు. ప్రతీ ద్వాపరయుగం లోనూ ఒక వ్యాసుడు ఉద్భవిస్తాడు. సాక్షాత్తు ఆ శ్రీమన్నారయణుడే వ్యాసుడుగా అవతరిస్తాడు. ఈ అనంతంగా తిరిగే కాలచక్రంలో ధర్మం కృత యుగం లో 4 పాదాలతో , త్రేతాయుగంలో 3 పాదాలతో , ద్వాపరయుగంలో2 పాదాలతో , ఈ కలియుగంలో 1 వ పాదంతో నడుస్తుంది.

వశిష్ఠమహామునికి మునిమనుమడు, శక్తి మహా మునికి మనుమడు , పరాశరమునికి పుత్రుడు , శు కమహర్షికి జనకుడైనట్టియు , నిర్మలుడైనట్టి తపవు అనే ధనరాశి గలిగిన శ్రీ వ్యాసులవారికి నమస్కారము. ఆదిగురువు వేదవ్యాసులవారు. వ్యాసులవారు పుట్టిన రోజునే గురుపూర్ణిమ , వ్యాసపూర్ణిమ అంటారు

నారాయణమూర్తి స్వరూపమే వేదవ్యాసులవారు. అందుకే ఆయన్ని అపర నారాయణుడని పిలుస్తారు. వేదవిభజన చేసిన మహానుభావుడాయన. ఆయనవల్లనే మనకు అష్టాదశ పురాణాలు ఏర్పడ్డాయి. భారత భాగవతాలనందించినవారే వ్యాసులవారు.

వ్యాసమహర్షి ఒక వ్యక్తి పేరు మాత్రమే కాదు. ప్రతి ద్వాపర యుగములోను ఒక సారి వ్యాసుడు ఉద్భ విస్తాడు. ప్రస్తుతం మనం ఉంటున్నది వైవస్వత మన్వంతరంలో ని 28 వ యుగంలోని వ్యాసుడు కృష్ణద్వైపాయనుడు కాలంలో.

ఇంతవరకు వ్యాసపీఠాన్నధిరోహించిన వ్యాసులు పేర్లు 1. స్వాయంభువ 2. ప్రజాపతి 3. ఉశన 4. బృహశ్పతి 5. సవిత 6. మృత్యువు 7. ఇంద్ర 8. వశిష్ఠ 9. సారస్వత 10. త్రిధామ 11. త్రివృష 12. భరద్వాజ 13. అంతరిక్షక 14. ధర్ముడు 15. త్రయారుణ 16. ధనుంజయుడు 17. కృతంజయుడు 18. సంజయ 19. భరద్వాజ 20 గౌతమ 21. ఉత్తముడు 22. వాజశ్రవ 23. సోమశుష్మాయణ 24. ఋక్షుడు 25 శక్తి 26. పరాశరుడు 27. జాతూకర్ణి ప్రస్తుతం 28 వ వేదవ్యాసుని పేరు కృష్ణద్వైపాయనుడు.

ఆయన జన్మించిన తిథి అయిన ఆషాఢ శుద్ధ పూర్ణిమను గురు పూర్ణిమ గా జరుపుకుంటాం. లోకానికంతటికీ జ్ఞానాన్ని అందించిన గురువు వ్యాసుడు కాబట్టి వ్యాసుని జన్మ తిథిని గురు పూర్ణిమగా జరుపుకోవడం ఆచారమైంది.

28 వ వేద వ్యాసుల వారి జయంతి. ఇతడు పరాశర మహర్షికి , మత్స్య గంధికి (సత్యవతి) కి కృష్ణ వర్ణం (నల్లని రంగు) తో ఒక ద్వీపంలో జన్మించారు కనుక కృష్ణద్వైపాయనుడు అని పిలవబడ్డాడు. పుట్టీ పుట్టగానే చేతిలో కమండలం , దండము చేతబట్టి తపస్సు చేసుకోవటానికి వెళ్తానని తల్లి మత్స్యగంధి అనుమతితో తపస్సుకు వెళ్ళిన తపోధనుడు కృష్ణద్వైపాయనుడు.

వ్యాస మహర్షి నాలుగు వేదాలను విభజించి లోకానికి అందించాడని పురాణాలు చెబుతున్నాయి. పూర్వం సోమకాసురుడు వేదాలను సముద్రంలో దాచేస్తే.. శ్రీ మహా విష్ణువు మత్స్యావతారంలో ఆ వేదాలను తీసుకొచ్చాడు. అలా వచ్చిన వేదాలు ఒకదానితో ఒకటి కలిసి కలగాపులగం అయిపోగా.. వాటిని వ్యాస మహర్షి విడదీసి విభజించి నాలుగు వేదాలుగా లోకానికి అందించాడు. వేదరాశి ని నిత్య కర్మలలో క్రతువుల్లో వాడే ఉపయోగాలను బట్టి ఋక్-యజుర్-సామ-అధర్వణ వేదాలుగా విభజించి వేదవ్యాసుడైనాడు. ఆతర్వాత బ్రహ్మదేవుని ఆజ్ఞతో విఘ్నేశ్వరుడు రాయగా ... వేదసారాన్నంతా చేర్చి పంచమవేదంగా ప్రసిద్ధికెక్కిన భారత ఇతిహాసాన్ని గ్రంథస్తం చేసాడు. అంతేకాక భాగవతాన్ని, అష్టాదశ పురాణాలను మనకు ప్రసాదించాడు. సాక్షాతు శ్రీ మహా విష్ణువు అవతారంగా భావించే వ్యాస భగవానుని గానూ ఆదిగురువుగానూ భావిస్తారు.

**విష్ణు సహస్రనామ పీఠిక లో కూడా....**

**"వ్యాసాయ విష్ణు రూపాయ - వ్యాస రూపాయ విష్ణవే**
**నమోవై బ్రహ్మ నిధయే వాశిష్టాయ నమోనమ: !!**

అని వ్యాసునికి విష్ణువుకు అభేదం చెప్ప బడింది , వేదవ్యాసుడు అనంతంగా ఉన్న వేదాలని విభజించి పైలుడను శిష్యునకు ఋక్సంహితను , వైశంపాయనునకు యజుస్సంహితను , జైమినికి సామసంహితను , సుమంతునకు అధర్వణ సంహితను భోధించి వానిని లోకములో వ్యాప్తి చేయండని ఆదేశించాడు. వ్యాసుడు వేదాలని విభజించటమే కాకుండా అష్టా దశ పురాణాల్ని , ఉపపురాణాలను రచించాడు. బ్రహ్మసూత్రాల్ని వివరించాడు , భారత , భాగవతాలని రచించాడు. తాను గ్రంథస్థం చేసిన పురాణేతిహాసములను సూతునకు తెలియజేసి ప్రచారం చేయమని చెప్పాడు.

వ్యాస భగవానుని అనుగ్రహం వలన జ్ఞానం విస్తరించి విశ్వవ్యాప్తం అయ్యింది. సూత మహాముని ప్రధాన ప్రచారకుడై విషయములు బహుళ ప్రచారం చేసాడు.

స్మృతి కర్తలలో వ్యాసులవారు ఒకరు. రెండధ్యాయ ముల ఈ గ్రంథానికి లఘు వ్యాస స్మృతి అని పేరు. ఇందులో మానవులకు ఉపయోగ పడే ఆచార విషయములు ఉన్నాయి. ఇదే వ్యాస సంహిత గా విఖ్యాతి పొందింది.

వ్యాస మహర్షి సుపుత్రుని కోసం తపస్సు చేసి శివుని నుంచి వరాన్ని పొందాడు. ఆయనకు ఘృతాచి అనే అప్సరస వలన బ్రహ్మ జ్ఞానిఐన శుకుడు జన్మించాడు.

**వ్యాసం వశిష్ఠనప్తారం శక్తే , పౌత్రమకల్మషమ్ ।**
**పరాశరాత్మజమ్ వందే శుక తాతం తపోనిధిమ్ ॥**

తాత్పర్యం:- వశిష్టుని మునిమనుమడైన కల్మష రహితుడైన శక్తికి మనుమడైన పరాశరుని కుమారుడైన , శుకమహర్షి తండ్రి అయిన ఓ వ్యాస మహర్షి నీకు వందనము.

**వ్యాసో నారాయణో హరిః** అన్నారు. వ్యాస భగవానులు సప్త చిరంజీవులలో ఒకరు.

**మహాభారత రచన :-**

మహాభారత రచనకు తనమనసులో ఒక ప్రణాళికను తయారుచేసుకొన్నాడు వేదవ్యాసుడు. తాను చెబుతుంటే..... అంత వేగంగా వ్రాసే వారు ఎవరు ఉన్నారూ అని విచారంలో ఉండగా..... బ్రహ్మ వ్యాసుని కోరికను గుర్తించి , అతని ఎదుట ప్రత్యక్షమయ్యి "వ్యాసా ! నీ కావ్యరచనకి, తగినవాడైన గణపతిని స్మరించు." అని తెలిపి అద్రుశ్యమయ్యాడు. అంతట వ్యాసుడు గణేశుని ప్రార్థించగా.... గణేశుడు ప్రత్యక్షమయ్యాడు. నేను మనసులోనే రచించిన భారతాన్ని నేను చెబుతూ ఉంటే నీవు వ్రాయాలి అని కోరాడు వ్యాసుడు. సరే అని ఒక షరతు పెట్టాడు గణేశుడు. నేను వ్రాసే ఘంటం ఆగకుండా నీవు చెప్పాలి. నా ఘంటం ఆగిన యెడల నేను వ్రాయను అని అన్నాడు. దానికి వ్యాసుడు అంగీకరించి నేను చెప్పిన శ్లోకాలను అర్థం చేసుకొని నీవు వ్రాయాలి అని అన్నాడు.... ఈ నియమానికి అంగీకరించాడు గణపతి. ఇలా వేద ధర్మాలను ప్రతిపాదిస్తూ వేదవ్యాసుడు చెబుతూ ఉంటే , నాలుగు వేదాల సారమైన పంచమవేదం అని మనం చెప్పుకొనే మహాభారతం అవతరించింది.

ఈయన వల్లే కురువంశం అభివృద్ధి చెందింది. తల్లి కోరికపై దృతరాష్టుని , అంబాలికకు పాండు రాజుని , అంబికదాసికి విదురుని ప్రసాదించినాడు. పాండవాగ్రజుడైన ధర్మరాజుకి ప్రతిస్మృతిని ఉపదేశించింది వ్యాసుడే ! దానిని ధర్మరాజు ద్వారా అర్జునుడు ఉపదేశం పొంది దేవతలను మెప్పించి అస్త్రశస్త్రాలుపొందాడు. కురుపాండవ చరిత్ర ఖ్యాతి పొందేట్లుగా మూడు సంత్రమించి జయం అనే పేరు మీద వారి గాథలు గ్రంథస్థం చేసాడు వ్యాసుడు. ఆ జయమే మహాభారతమైంది.

కలియుగంలో మానవులు అల్పబుద్ధులు , అల్పాయువులై ఉంటారు. అందుకే మన ప్రాచీనులు పరమ ప్రామాణికంగా.... అంగీకరించిన వేదాన్ని అధ్యయనం చేయలేరు. అర్థం చేసుకోలేరు.

వేదమంటే అసలు ఎవరూ తయారుచేసింది కాదు. స్వయం భగవానుని ముఖతః వేలువడినదే వేదము. అందుకే అతనిని "వేదపురుషుడు" అని అంటారు. వేదములో విషయాలు ఉన్నాయి. వేదములో లేనివి-మరెక్కడా లేవు. ఇవన్నీ కలగాపులగంగా ఏక రూపంలో ఉంటాయి. దీనిని కలియుగంలో ఉన్న జనులు అర్థం చేసుకోలేరని, భగవానుడే ప్రతీ ద్వాపరయుగంలోనీ వ్యాసుడుగా అవతరించి, వేదాలను విభజిస్తాడు మంద బుద్దుల కోసం వేదాధ్యాయానికి, అవకాశం లేని వారి కోసం వేదంలోని విశేషాలను, ఇతిహాస పురాణాల ద్వారా లోకానికి అందించాడు.

ప్రాచీన గాథలు , గత కల్పాలలో జరిగిన చరిత్రలు , సృష్టికి పూర్వం అనేక సృష్టులలో జరిగిన విశ్వం యొక్క పూర్వ వృత్తాంతం మన పురాణాల్లో నిగూఢంగా నిక్షిప్తమయినాయి. ఎవరు వాటిని అర్ధం చేసుకోవాలన్నా , ఇతరులకి చెప్పాలన్నా అంతరార్థాలతో బోధించాలన్న వ్యాస మహర్షి అనుగ్రహం అత్యవసరం. వ్యాస మహర్షి అంశ లేనిదే ఎవరూ పురాణ గాథల్ని చెప్పలేదు , చదవలేదు. అందుకే వ్యాసపూర్ణిమ నాడు వ్యాస పూజను తప్పక చేయాలంటారు. ఈ పర్వము యతులకు అతి ముఖ్యం ! వ్యాస పూర్ణిమ పర్వాన్ని ఆదిలో శంకరాచార్యులు ఏర్పాటు చేశారని చెబుతారు.

పూజా విధానం (వ్యాస పూజ , గురు పూజా విధానం)

కొత్త అంగవస్త్రం మీద (భూమి మీద పరచి) బియ్యం పోస్తారు. ఆ బియ్యంపైన నిమ్మ కాయలు ఉంచుతారు. శంకరులు , అతని నలుగురు శిష్యులు వచ్చి దానిని అందుకుంటారని నమ్మకం. పూజ అయ్యాక ఆ బియ్యం తీసుకెళ్ళి పిడికిడు చొప్పున తమ ఇళ్లల్లో బియ్యంలో కలుపు తారుట. బియ్యం , కొత్త వస్త్రం లక్ష్మీ చిహ్నాం. నిమ్మపళ్ళు కార్యసిద్ధికి సూచన. బియ్యం , నిమ్మపళ్ళు లక్ష్మీ కటాక్షానికి చిహ్నాం. దక్షిణాదిన కుంభ కోణంలో , శృంగేరీలో శంకర మఠాలలో వ్యాసపూర్ణిమ ఎంతో వైభవంగా జరుపుతారు.

ఎంతో మంది ఋషులున్నా వ్యాసుని పేరిటే ఎందుకు జరుగుతుంది అంటే , ఈ పూజలో ప్రత్యేక పూజలు పొందే ఆది శంకరులు వ్యాసుని అవతారమని అంటారు. సన్యాసులంతా ఆది శంకరుని తమ గురువుగా ఎంచుకుంటారు. అయితే ఈ రోజున సన్యాసులంతా వ్యాసుని రూపంలో వున్న తమ గురువుని కొలుస్తున్నారన్న మాట! వైష్ణవ పురాణం దానం చేస్తే ఆషాఢ పూర్ణిమనాడు విష్ణులోకం పొందుతారుట. వ్యాసుడు సకల కళా నిధి , సకల శాస్త్రవేత్త , శస్త్ర చికిత్సవేది , మేధానిధి , వైద్యవరుడు , ఆత్మవిద్యానిధి , వైద్య విద్యానిధి. ఈ రోజున అష్టాదశ పురాణ నిర్మాత అయిన వ్యాసుని తప్పక పూజించాలి.

**వ్యాస పూర్ణిమ నాడు ఈ శ్లోకాన్ని పఠించాలి.**

**శ్లో: శంకరం శంకరాచార్యం గోవిందం బాదరాయణం**
**సూత్ర భాష్యవృతా వందే భగవంతౌ పునః పునః**
**అని పఠిస్తే బ్రహ్మత్వసిద్ధి కలుగును!**

**గురు సందేశము** :- వేదవ్యాసుడు తన రెండు చేతులనూ పైకి ఎత్తి లోకమంతటికీ నమస్కరిస్తూ చెప్పిన మాటల్లో విశిష్టమైనది ఏమిటంటే- 'ఇతరులు మీ పట్ల ఏ విధంగా ప్రవర్తిస్తే మీరు బాధపడతారో మీరు ఇతరుల పట్ల ఆ విధంగా ప్రవర్తించవద్దు.' పరమ ధర్మపథాలన్నింటిలోకీ పరాయణమైన ఈ ఒకే ఒక్క విషయాన్ని త్రికరణశుద్ధిగా పాటించినట్లయితే మన సమాజం కచ్చితంగా శాంతిధామమవుతుంది.

సర్వభూతముల యందు దయకలిగియుండుట , సత్యమార్గములో నడుచుట , శాంతగుణాన్ని కలిగి యుండు ట ఈ మూడు గుణాలని అందరూ అలవరచుకోవాలి అని వ్యాసులవారు తెలియచేసారు.

మనందరికీ దేవరుణము, ఋషిరుణము, పితృ ఋణము అని మూడు ఋణాలు ఉంటాయి. వీటితో పాటు వేదవ్యాసుడు మనుష్య ఋణము కూడా ఉంటుందని తెలియచెప్పాడు. సర్వప్రాణుల యందు దయతో ఉండటం , ఇతరులకు ఉపకారం చేయటం ద్వారా మనుష్య ఋణం తీర్చుకోవచ్చును అని చెప్పాడు.

ఇంతటి ఆది గురువుని పూజించుట మన కర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని తరవాత తరాలకి అందించుట మన ధర్మం.

మన పిల్లలకు ఇతిహాస , పురాణాల పట్ల , ప్రాచీన సంస్కృతీ సాంప్రదాయాల పట్ల , అభిరుచి కలిగించుట మన కర్తవ్యం. వీటిలో కొన్నయినా సాధించగలిగితే వ్యాసులవారి ఋణం కొంతయినా మనం తీర్చుకున్నట్లు అవుతుంది. ఆ వ్యాసభగవానుని కృపకు మనము పాత్రులము కాగలము అని ఆశిద్దాం. అందుకే గురుపూజను చేసుకుందాం. సాటి గురువులో భగవంతుని దర్శిద్దాం.

## ఈ వంటింటి పదార్థాలు వర్షాకాలంలో వ్యాధులను దూరం చేస్తాయి



వర్షం అహ్లాదరమైన వాతవరణం మరియు మనస్సుకు ఆనందాన్ని ఇస్తుంది. అయితే అహ్లాదంతో పాటు వ్యాధులను కూడా త్వరగా ప్రబలిస్తుంది. ప్రస్తుతం, తెలుగు రాష్ట్రాల్లోనే కాదు అనేక ప్రాంతాల్లో వర్షాలు బలంగా కనిపిస్తున్నాయి మరియు తెలంగాణాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి.. వర్షాకాలంలో చలి మరియు వర్షం అనేక ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. పిల్లలు మరియు వృద్ధులు ముఖ్యంగా ఈ అంటు వ్యాధులకు గురవుతారు. వర్షాకాలంలో జలుబు దగ్గు, ఫ్లూ, టైఫాయిడ్ లాంటివి ఎక్కువగా వచ్చే వ్యాధులు.

అటువంటి పరిస్థితిలో మనల్ని మనం ఆరోగ్యంగా మరియు ఫిట్‌గా ఉంచుకోవడానికి మన శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచుకోవడం చాలా ముఖ్యం. అందుకోసం ఆహారంలో సరైన మార్పులు చేసుకోవడం ద్వారా మీ రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవచ్చు. దీని కోసం మీరు ఆయుర్వేద పదార్థాల సహాయం తీసుకోవచ్చు.

ఈ పదార్థాల సహాయంతో, మీరు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయవచ్చు మరియు జ్వరం మరియు జలుబు, దగ్గు, ఫ్లూ, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి అంటు వ్యాధుల నుండి దూరంగా ఉండవచ్చు. కాబట్టి కొన్ని రోగనిరోధక శక్తిని పెంచే ఆయుర్వేద పదార్థాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**తులసి:** తులసి మన ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా పరిగణించబడుతుంది. తులసిని ఆయుర్వేదంలో "ది క్వీన్ అఫ్ హెర్బ్స్", "మదర్ మెడిసిన్ అఫ్ నేచర్" అని కూడా పిలుస్తారు. తులసి ఆధ్యాత్మిక ప్రాముఖ్యతతో పాటు. దాని ఔషధ గుణాలకు కూడా ప్రసిద్ధి చెందింది. తులసిని ప్రతిరోజూ తీసుకోవడం వల్ల వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా వర్షాకాలంలో దగ్గు, ఉబ్బసం, అతిసారం, జ్వరం, విరేచనాలు, కీళ్లనొప్పులు, కంటి వ్యాధులు నివారించడంలో తులసి అద్భుతమైన ప్రయోజనాలను కలిగి ఉంది.

**అల్లం:** వర్షాకాలంలో వ్యాధులను ఎదుర్కోవడానికి న్యాచురల్ రెమెడీ ఇది. అల్లంలో రోగనిరోధక శక్తిని పెంచే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. అల్లంలో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ వైరల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ మరియు యాంటీ ఆక్సిడేటివ్ లక్షణాలు ఉంటాయి. అల్లం గొంతు నొప్పి నుండి త్వరగా ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. సాధారణ జలుబు మరియు ఫ్లూకి కారణమయ్యే రైనోవైరస్లను కూడా నిరోధిస్తుంది.

అల్లం-తులసి కషాయం చేయడానికి, ముందుగా తులసి ఆకులు మరియు తురిమిన అల్లంను నీటిలో 5-7 నిమిషాలు ఉడకబెట్టండి. ఆ తరువాత, తేనె మరియు నిమ్మరసంతో మిశ్రమాన్ని వడగట్టి, ఈ నీటిని గోరువెచ్చగా తాగాలి. ఈకషాయం తాగడం వల్ల వివిధ రకాల ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని రక్షిస్తుంది మరియు రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది.

**దాల్చినచెక్క:** దాల్చినచెక్క-లవంగాలను ముఖ్యంగా ఆహార తయారీలో గరం మసాలాగా ఉపయోగిస్తారు. కానీ ఈ దాల్చినచెక్క-లవంగంలో ఆహారానికి రుచిని జోడించడమే కాకుండా, చాలా ఔషధ గుణాలు ఉన్నాయి. దాల్చిన చెక్కలో పాలీఫెనాల్స్ మరియు ప్రోయాంతోసైనిడిన్స్ మరియు యాంటీఆక్సిడెంట్ పుష్కలంగా ఉన్నాయి. ఇంకా సిన్నమైల్ అసిటేట్, సిన్నమైల్ ఆల్కహాల్ వంటి ముఖ్యమైన నూనెలు కూడా ఉన్నాయి. ఇవి యాంటీవైరల్, యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఫంగల్ లక్షణాలతో రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి.

కాబట్టి, లవంగం-దాల్చిన చెక్క డికాషన్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఈ కషాయం చేయడానికి, ముందుగా ఒక పాన్‌లో ఒక దాల్చిన చెక్క మరియు నాలుగు-ఐదు లవంగాలను తీసుకోండి. ఈ రెండు పదార్థాలను నీటిలో 10 నిమిషాలు ఉడకబెట్టండి. తరువాత, ఈ మిశ్రమాన్ని నీటిలో ఫిల్టర్ చేయండి. ఇప్పుడు 1 టీస్పూన్ తేనె మరియు నిమ్మరసం కలపండి మరియు ఈ సారం త్రాగాలి. ఈ డికాషన్ తాగడం వల్ల జ్వరం-జలుబు, దగ్గు నుంచి ఉపశమనం లభిస్తుంది. అంతేకాదు మన శరీరంలో రోగనిరోధక శక్తి కూడా బలపడుతుంది.

## గోధుమ రవ్వతో ఇలా ఇడ్లీలు చేయండి..



గోధుమ రవ్వతో సాధారణంగా ఉప్మా లేదా గోధుమ రవ్వ స్వీట్ తయారు చేస్తూ ఉంటారు. కానీ గోధుమ రవ్వతో ఇడ్లీ కూడా తయారు చేసుకోవచ్చు. ఎప్పుడూ ఉప్మానే కాకుండా ఇలా డిఫరెంట్‌గా ట్రై చేయండి. అంతే కాకుండా ఇది ఎంతో హెల్దీ కూడా. హెల్దీ బ్రేక్ ఫాస్ట్ కావాలి అనుకునేవారు ఇలా ట్రై చేయొచ్చు. అలాగే త్వరగా కూడా అయిపోయింది. ఇవి రుచిగా, సాఫ్ట్‌గా ఉంటాయి. వెరైటీగా కావాలి అనుకునే వారు గోధుమ రవ్వతో ఇడ్లీలను తయారు చేసుకోండి. వీటిని చట్నీ లేదా సాంబార్‌తో పాటు చేసుకోవచ్చు. ఇందులో క్యారెట్, జీడి పప్పు, తాళింపులు, పచ్చి బఠానీ, టమాటా ఇలా మీకు నచ్చినవి కూడా యాడ్ చేసుకోవచ్చు. మరి ఈ గోధుమ రవ్వ ఇడ్లీలను ఎలా తాయరు చేస్తారు.

**గోధుమ రవ్వ ఇడ్లీలకు కావాల్సిన పదార్థాలు:** గోధుమ రవ్వ, ఆయిల్, తాళింపు దినసులు, తరిగిన కొత్తి మీర, తరిగిన కరివేపాకు, పుల్లటి పెరుగు, క్యారెట్ తురుము, పచ్చి బఠాణి, వంట సోడా, ఉప్పు, తరిగిన పచ్చి మిర్చి.

**తయారీ విధానం:** ముందుగా కడాయిలో ఆయిల్ వేసి వేడి చేయాలి. ఆయిల్ వేడెక్కాక.. తాళింపు దినసులు, జీడిపప్పులు వేసి వేయించుకోవాలి. ఆ తర్వాత పచ్చి మిర్చి, కొత్తి మీర, కరివేపాకు, క్యారెట్ తురుము, పచ్చి బఠాణి వేసి బాగా వేయించుకోవాలి. ఆ తర్వాత గోధుమ రవ్వ కూడా వేసి ఓ రెండు నిమిషాలు వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు రవ్వ చల్లారిన తర్వాత ఉప్పు, పెరుగు, వంట సోడా, తగినన్ని నీళ్లు వేసి.. ఇడ్లీ బ్యాటర్‌లా కలుపు కోవాలి. ఇప్పుడు దీనిపై మూత పెట్టి ఓ పావు గంట పక్కన పెట్టాలి.

ఆ తర్వాత ఇడ్లీ రేకులను తీసుకుని.. ఇడ్లీలు వేసి ఉడికించుకోవాలి. మధ్య మధ్యలో వీటిని చూసుకుంటూ ఉండాలి. ఉడికాక స్టవ్ ఆఫ్ చేసి.. సర్వింగ్ ప్లేట్‌లోకి తీసుకోవడమే. వీటిని చట్నీ లేదా సాంబార్‌తో తినొచ్చు. అంతే ఎంతో టేస్టీగా ఉండే గోధుమ రవ్వ ఇడ్లీలు రెడీ. వెరైటీగా కావాలి అనుకుంటే ఇలా ట్రై చేయండి. ఇంకెందుకు లేట్ మీరు కూడా ఓ సారి ట్రై చేయండి. చాలా టేస్టీగా ఉంటాయి.

## మధ్యాహ్నం తిన్న వెంటనే నిద్రొస్తుందా....



కొంతమంది భోజనం తర్వాత పడుకుంటారు. దీని వల్ల శరీరానికి అంత మంచిది కాదు. దీని వల్ల చాలా సమస్యలొస్తాయి. ఇదిలానే కంటిన్యూ అయితే శారీరక సమస్యలొస్తాయి. అసలు ఎందుకు భోజనం చేశాక ఎందుకు నిద్రపోకూడదో తెలుసుకోండి.

**తిన్న తర్వాత నిద్ర..** తిన్న తర్వాత నిద్ర రావడం చాలా మందికి జరగ్నుతుంది. దీనికి కారణం తిన్న తర్వాత బాడీ హార్మోన్స్‌ని రిలీజ్ చేస్తుంది. ఇది మిమ్మల్ని ప్రశాంతంగా ఉంచుతుంది. ఆహారం జీర్ణం అవుతుంది కాబట్టి, ఎక్కువ రక్త సరఫరా ప్రేగులకి పంపుతుంది. దీంతో బ్రెయిన్ పనిచేయడం కొద్దిగా తగ్గుతుంది. ఇందలోనే హై ప్రోటీ, హై కార్బ్ భోజనం మీకు మరింత మగతగా అనిపించేలా చేస్తుంది. కానీ, భోజనం తర్వాత మీకు అలసటగా అనిపిస్తే అది సాధారణమా లేదా.. షుగర్, జీర్ణ సమస్యలకి సంబంధించిన లక్షణమా అని తెలుసుకోవడానికి మీ డాక్టర్‌ని కలవండి.

**గుండెల్లో మంట..** తిన్న తర్వాత వెంటనే పడుకోవడం కడుపు బరువుగా అనిపిస్తుంది. దీంతో పాటు జీర్ణక్రియ సమస్యలొస్తాయి. కడుపులో ఆమ్లం అన్నవాహిక ద్వారా పైకి వస్తుంది. ఇది యాసిడ్ రిఫ్లక్స్‌కి కారణమవుతుంది. దీనిలో సాధారణ లక్షణం గుండెల్లో మంట. ఛాతీలో వెనుక నొప్పితో ఇబ్బంది అవుతుంది. దీంతో నిద్ర సమస్యలొస్తాయి.

**బరువు పెరగడం..** రాత్రి పూట ఆలస్యంగా భోజనం చేయడం, కేలరీలు ఎక్కువగా ఉండే ఫుడ్స్ తిని పడుకోవడం వల్ల ఊబకాయం వస్తుంది. భోజనం తర్వాత వెంటనే పడుకోవద్దు. దీని వల్ల బరువు పెరుగుతుందని పరిశోధకులు అంటున్నారు. దీనికి సంబంధించిన కారణాలపై పరిశోధనలు జరుగుతున్నాయి.

**రాత్రిపూట మేల్కోవడం..** తిన్న తర్వాత పడుకోవడం వల్ల గ్యాస్ట్రిక్ సమస్య లొచ్చి రాత్రుళ్ళు పడుకోరు. దీంతో నిద్రలేమి సమస్యలు వస్తాయి. ఎక్కువగా తిని త్వరగా పడుకునే వారికి మంచి నిద్ర పట్టదని పరిశోధనల్లో తేలింది. దీనికి కారణం బ్రెయిన్ మిమ్మల్ని మెలకువగా ఉంచడానికి శక్తి కోసం ఉపయోగించే ఇన్సులిన్ అనే హార్మోన్‌ని విడుదలను ప్రేరేపిస్తుంది. ఇది సర్కాడియన్ రిథమ్‌ని మారుస్తుంది. జర్నల్ ఆఫ్ క్లినికల్ స్లీప్ మెడిసిన్‌లో పబ్లిష్ అయిన అధ్యయనం ప్రకారం లేటుగా తినడం, నిద్రపోవడం మధ్య బలమైన సంబంధం ఉంటుంది.

**సమస్యలు రాకుండా..** నెగెటీవ్ ఎఫెక్ట్స్‌ని దూరం చేయడానికి తిన్న తర్వాత సమయం తీసుకుని పడుకోండి. అది కూడా ఓ గంట మాత్రమే నిద్ర ఉండేలా చూసుకోండి. హెవీ ఫుడ్ అయితే ఎక్కువ సమయం అయ్యాక పడుకోండి. దీంతో జీర్ణ సమస్యలు రావు.

**పడుకునే ముందు ఏం తినాలి..** ప్రోటీన్స్, కార్బోహైడ్రేట్స్, పీచుతో కూడిన బ్యాలెన్స్ ఫుడ్ తీసుకోవాలి. దీని వల్ల రక్త స్థాయిలు బ్యాలెన్స్ అయి మంచి నిద్రని ప్రోత్సహిస్తాయి. ఏం తినాలంటే..

లో ఫ్యాట్ ఫుడ్స్, పాలు, ఫైబర్ ఎక్కువగా ఉండే హెూల్ గ్రెయిన్స్, పెరుగు, బాదం, పప్పులు, పుల్లని చెర్రీ, వేరుశెనగ, సాల్మన్ చేప, టోఫు, చెర్రీ, నట్స్. అదే విధంగా, ఎంత తింటాం, ఎలా తింటున్నాం.. మనం భోజనం తర్వాత చేసే పనులను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

## కాల్షియం కోసం పాలు మాత్రమే తాగల్సిన అవసరం లేదు..



మన శరీరంలో క్యాల్షియం లోపం ఎన్నో అనారోగ్యాలకు దారి తీస్తుంది. అందుకే ప్రతిరోజు మనం తినే డైట్ లో క్యాల్షియం కూడా ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. కాల్షియం అనగానే అందరికీ గుర్తొచ్చేది పాలు. కానీ అందరికీ పాలు తాగడం ఇష్టం ఉండదు. క్యాల్షియం అంటే పాలలో మాత్రమే ఉండదు ఇంకా చాలా ఆహార పదార్థాల్లో ఉంటుంది. ఒకవేళ పాలు తాగడం నచ్చకపోతే వారు తమ శరీరంకి ఉపయోగపడే కాల్షియం కోసం వేరే ఆహార పదార్థాలను తీసుకుంటే సరిపోతుంది.

పాలతో తయారు అయ్యే పెరుగు లో కూడా క్యాల్షియం ఎక్కువగానే ఉంటుంది. నిజం చెప్పాలంటే పాల కంటే ఎక్కువ క్యాల్షియం పెరుగులో ఉంటుంది. పెరుగన్నంలో మీకు నచ్చిన ఫ్రూట్స్ కూడా వేసుకొని తినొచ్చు. అందులో ఉండే గుడ్ బ్యాక్టీరియా మన జీర్ణాశయానికి ఎంతో మంచిది.

ఆరెంజ్ జ్యూస్ లో కూడా క్యాల్షియం ఎక్కువగానే ఉంటుంది. కానీ అతిగా ఆరెంజ్ జ్యూస్ కూడా తాగకూడదు. రోజుకి 10 ఔన్స్ ల కంటే ఎక్కువ జ్యూస్ తాగకూడదు అని గుర్తుంచుకోండి.

ఆవు పాలు లేదా గేదె పాలు నచ్చని వారు ఓట్ మిల్క్ కూడా ట్రై చేయొచ్చు. అందులో కూడా కాల్షియం పుష్కలంగా దొరుకుతుంది. ఇంట్లోనే తయారు చేసుకునే ఓట్ మిల్క్ లో ఇంకా ఎక్కువ పోషకాలు ఉంటాయి.

బాదం పాలలో క్యాల్షియం తో పాటు ఫైబర్, మెగ్నీషియం, విటమిన్ ఏ లు కూడా ఉంటాయి. ఒక కప్పు బాదం పాలలో ఆవు పాల కంటే ఎక్కువ క్యాల్షియం ఉంటుంది. ఇంకా బాదంపాలలో క్యాల్షియం మాత్రమే కాక ప్రోటీన్ కూడా ఎక్కువగానే ఉంటుంది. అది కూడా ఆరోగ్యానికి ఎంతో మంచిది.

సోయా పాలల్లో కూడా మంచి కాల్షియం కంటెంట్ ఉంటుంది. అంతే కాక విటమిన్ డి కూడా ఉంటుంది. ఒక కప్పు సోయా మిల్క్ లో 6 గ్రాముల ప్రోటీన్ కూడా ఉంటుంది.

కాల్షియం లెవెల్స్ తగ్గిపోతే మన శరీరం కూడా బాగా నీరశపడిపోతుంది. ముఖ్యంగా బోన్స్ చాలా వీక్ అయిపోతాయి. దానివల్ల ఎముకల సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉంది.

తగినంత కాల్షియం లేకపోవడం వల్ల ఎముకల వ్యాధి, ఆస్టియోపెనియా, హైపోకాల్సెమియా వంటి అనారోగ్యాలు రావచ్చు. పిల్లలలో దీని లోపం ఉంటే వారి అభివృద్ధి లేట్ అవుతుంది. అలాంటి క్యాల్షియం లోపాన్ని ప్రారంభ దశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.

## గుండెపోటు......... లక్షణాలు



గుండెపోటుకు సంబంధించిన కొన్ని లక్షణాలు చాలా నెలల ముందే శరీరంలో కనిపించడం ప్రారంభిస్తాయి. ఈ లక్షణాలు విస్మరించినట్లయితే, ఈ లోపం తీవ్రమైనది కావచ్చు. అలాంటి ఒక లక్షణం గుండెపోటుకు ముందు శరీరంలోని పైభాగంలో నొప్పి.

ఈ మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా మరణాలకు ప్రధాన కారణం గుండెపోటు. గత కొంత కాలంగా యువకుల్లో గుండెపోటు, ఆకస్మిక మరణాలు పెరుగుతున్నాయి. చాలా మంది గుండెపోటును ఆకస్మిక సంఘటనగా భావిస్తారు, వాస్తవానికి గుండెపోటు ప్రక్రియ నెలల తరబడి శరీరం లోపల కొనసాగుతుంది.

అంటే, శరీరంలో మార్పులు చాలా ముందుగానే జరగడం ప్రారంభిస్తాయి, ఇది భవిష్యత్తులో గుండెపోటు ప్రమాదాన్ని సూచిస్తుంది. శరీరంలో ఇటువంటి మార్పులను సకాలంలో గుర్తించి అవసరమైన చికిత్స తీసుకోవడం చాలా ముఖ్యం. కొన్ని లక్షణాలు సకాలంలో గుర్తించినట్లయితే ఒక వ్యక్తి యొక్క జీవితాన్ని కాపాడతాయి.

గుండెపోటుకు ముందు, నడుము పైన కొన్ని భాగాలలో నొప్పి ఉంటుంది.

**దవడ నొప్పి:** గుండెపోటుకు కొన్ని రోజుల ముందు దవడ నొప్పి మొదలవుతుంది. గుండెపోటు వచ్చినప్పుడు, నొప్పి భరించలేనిదిగా మారుతుంది.

**మెడ నొప్పి:** మెడ నొప్పి కూడా గుండెపోటు యొక్క ప్రారంభ లక్షణం. కొన్ని రోజులుగా మెడనొప్పి ఉంటే సమయం వృధా చేసుకోకుండా డాక్టర్ దగ్గరకు వెళ్లండి. మెడ నొప్పి తరచుగా సాధారణ లక్షణంగా పొరబడకండి.

**భుజం నొప్పి:** గుండెకు సమీపంలో ఉండటం వల్ల గుండెపోటుకు ముందు భుజం నొప్పి అనుభూతి చెందుతారు. భుజం నొప్పి కారణం లేకుండా అకస్మాత్తుగా వచ్చి తగ్గిపోతే, మీ గుండెను వైద్యునితో పరీక్షించుకోండి.

**వెన్నునొప్పి:** గుండెపోటు రావడానికి చాలా రోజుల ముందు వెన్నునొప్పి ఉంటుంది. కానీ చాలా మంది ఈ నొప్పిని తీవ్రంగా పరిగణించరు మరియు దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.

**ఛాతీ నొప్పి:** గుండెపోటు తర్వాత ఛాతీ నొప్పి మాత్రమే సమస్య కాదు. గుండెపోటుకు కొన్ని రోజుల ముందు తేలికపాటి ఛాతీ నొప్పి తరచుగా వస్తుంది.

## పుచ్చకాయతో ఆస్తమాకు చెక్..!



మండిపోయే ఎండలే పుచ్చకాయను తింటే అప్పుడు కలిగే అనుభూతి ఎన్ని కూల్‌డ్రింకులు తాగినా రాదు. శివరాత్రి పండగ రోజు ఈ పండు ప్రాముఖ్యత గురించి చెప్పనవసరం లేదు. ఎన్నో పోషకాలు ఇందులో ఉన్నాయ్. రోజూ కొన్ని పుచ్చకాయ ముక్కలు తింటే శరీరం డీహైడ్రేట్ కాకుండా ఉంటుంది. వేల యేళ్ల నుంచి పుచ్చకాయను ప్రాముఖ్యం ఉంది. ఆగస్టు 3ని పుచ్చకాయ రోజుగా జరుపుకుంటున్నాం.

**శరీరం హైడ్రేట్ అవుతుంది..** పుచ్చకాయలో 92 శాతం నీరే ఉంటుంది. ఎండాకాలంలో దీనిని తినడం వల్ల శరీరానికి అవసరమైనంత నీరు లభిస్తుంది. రోజూ తింటే డీహైడ్రేట్‌కు గురికాకుండా ఉంటాం. కొంతమందికి గొంతు త్వరగా ఎండిపోతుంది. పుచ్చకాయ తినడం వల్ల అలాంటి సమస్యలు ఎదురుకావు.

**బరువు నియంత్రణ:** పుచ్చకాయలో నీరు ఎక్కువగా ఉండడం వల్ల ఎంత తిన్నప్పటికీ బరువు పెరగకుండా ఉంటారు. పుచ్చకాయ ఎక్కువగా తినడం వల్ల అటు పోషకాలు మెండుగా అవడంతో పాటు ఇటు నీరు ఎక్కువగా ఉండడం వల్ల బరువుపెరిగే అవకాశం ఉండదు. పైగా శరీరం హైడ్రేట్ అవుతుంది.

**హృదయ సంబంధిత వ్యాధులను తగ్గిస్తుంది:** పుచ్చకాయలో ఉండే లైకోపీన్ పుచ్చకాయను ఎర్రగా మారుస్తుంది. టమాట ఎర్రగా ఉండడానికి కూడా ఈ లైపోనీనే కారణం. ఈ లైపోనిన్‌కు కొలెస్ట్రాల్‌ను తగ్గించే సామర్థ్యం ఉంటుంది. కొలెస్ట్రాల్ లెవెల్స్‌ను పుచ్చకాయ అదుపులో వుంచడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయ్.

**ఉబ్బసం, ఆస్తమా:** పుచ్చకాయలో 40 శాతం వరకు వైటమిన్ సి ఉంటుంది. ఉబ్బసాన్ని, ఆస్థమాను తగ్గించే శక్తి ఈ వైటమిన్ సిలో ఉంటుంది. ప్రతీరోజు పుచ్చకాయ తింటే ఆస్తమా, ఉబ్బసం తీవ్రత తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.

**నరాల బలహీనతు పొటాషియం:** శరీరంలో పొటాషియం తక్కువగా ఉంటే తిమ్మర్లు ఎక్కువగా వస్తాయ్. నరాలు కూడా బలహీనంగా మారిపోతాయ్. పుచ్చకాయలో ఈ పొటాషియం పోషకాలు మెండుగా ఉంటాయ్. రోజూ ఒక గ్లాసు పుచ్చకాయ జ్యూస్ తాగితే మీ శరీరంలో తిమ్మిర్లు రాకుండా చేస్తుంది.

**వడదెబ్బ నుంచి రక్షణ:** పుచ్చకాయలో ఉండే ఎలక్ట్రోలైట్స్ శరీరంలో ఉన్న వేడిని తగ్గిస్తుంది. కొన్ని సందర్భాల్లో మనకు తెలియకుండానే హీట్‌స్ట్రోక్‌కు గురౌతాము. కాబట్టి ప్రతీ రోజు కొంత పుచ్చకాయను ఖచ్చితంగా తినాలి మిమ్మల్ని మీరు వడ దెబ్బ నుంచి కాపాడుతోంది.

**టాక్సిన్సతో పోరాటం:** పుచ్చకాయలో క్యాల్షియం, పొటాషియం అధికంగా ఉంటాయ్. ఇవి శరీరంలోని టాక్సిన్స్ తో పోరాడి శరీరం బయటకు పంపించివేయబడుతంది. ఒక వేల టాక్సిన్స్ పెరిగితే కిడ్నీలు దెబ్బతినే అవకాశం ఉంది. దీంతో కిడ్నీలు కూడా దెబ్బతింటాయ్. కాబట్టి ప్రతీ రోజూ పుచ్చకాయ జ్యూస్ ఎలాగైనా తాగండి.

**జీర్ణక్రియకు సహాయం:** పుచ్చకాయలో అటు నీరు ఇటు ఫైబర్ రెండూ ఉంటాయ్. కడుపులో జీర్ణ్రియ సరిగ్గా జరగాలంటే నీరు, ఫైబర్ చాలా అవసరం. రోజూ పుచ్చకాయను తింటే మలబద్ధకం సమస్య ఉండదని వైద్యులే చెబుతున్నారు.

## నీకు నువ్వే తోడుగా నిలబడాలి

విత్తనం తినాలని
చీమలు చూస్తాయ్..
మొలకలు తినాలని
పక్షులు చూస్తాయ్..

మొక్కని తినాలని
పశువులు చూస్తాయ్

అన్ని తప్పించుకుని
ఆ విత్తనం వృక్షమైనపుడు.

చీమలు, పక్షులు, పశువులు..
ఆ చెట్టుకిందకే నీడ కోసం వస్తాయ్.

జీవితం కూడా అంతే TIME
వచ్చే వరకు వేచివుండాల్సిందే
దానికి కావాల్సింది ఓపిక మాత్రమే.

లైఫ్ లో వదిలి వెళ్ళిన
వాళ్ళ గురించి ఆలోచించకు.

జీవితంలో ఉన్న వాళ్ళు
శాశ్వతం అని భావించకు..

ఎవరో వచ్చి నీ బాధను అర్థం
చేసుకుంటారని ఊహించకు.

నీకు నీవే ధైర్యం కావాలి...
నీకు నువ్వే తోడుగా నిలబడాలి...

లోకులు కాకులు,
మనిషిని చూడరు,
మనస్సును చూడరు,
వ్యక్తిత్వాన్ని చూడరు.
కనిపించింది,
వినిపించింది నమ్మేస్తారు,
మాట అనేస్తారు,

ఒక్కోసారి మన కళ్ళే
మనల్ని మోసం చేస్తాయి.

మరొకసారి చెప్పుడు మాటలు
జీవితాలను
తలకిందులు చేస్తాయి

అబద్ధాలతో, మోసాలతో
కీర్తి, ప్రతిష్టలను
ఎంత గొప్పగా నిర్మించుకొన్నాలి..
అవి కుప్పకూలి పోవడానికి
ఒక్క "నిజం"చాలు.
అందుకే కష్టమైనా సరే
నీతిగా బ్రతకడమే మనిషికి
ఉత్తమ మార్గం.

ఒక చిన్న మొక్కనాటి
ప్రతిరోజూ వచ్చి కాయకాసిందా అని
చూడకూడదు.

ఎందుకంటే అది పెరగాలి
మొక్క వృక్షం కావాలి
పుష్పించాలి, పిందెలు రావాలి
అవి కాయలై , పండితే తినగలం.

అలాగే నేను ఇది కావాలి
అనే కోరిక కూడా మొలకై
వృక్షమై ఫలవంతం ఔతుందని తెలిసి
మసలుకోండి

జీవితంలో కష్టము,
కన్నీళ్ళు, సంతోషము,
బాధ ఏవి శాశ్వతంగా ఉండవు,

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండిపోదు.
ఆనందం, ఆవేదన కూడా అంతే.

నవ్వులూ, కన్నీళ్ళూ
కలగలసినదే జీవితం

కష్టమూ శాశ్వతం కాదు,
సంతోషమూ శాశ్వతమూ కాదు.

ఓడిపోతే
గెలవడం నేర్చుకోవాలి,

మోసపోతే
జాగ్రత్తగా ఉండడం నేర్చుకోవాలి

చెడిపోతే ఎలా
బాగుపడలో నేర్చుకోవాలి,

గెలుపును ఎలా పట్టుకోవాలో
తెలిసిన వాడికంటే
ఓటమిని ఎలా
తట్టుకోవాలో తెలిసిన వారే
గొప్ప వారు నేస్తమా !

దెబ్బలు తిన్న రాయి
విగ్రహంగా మారుతుంది

కానీ దెబ్బలు కొట్టిన
సుత్తి మాత్రం ఎప్పటికీ
సుత్తిగానే మిగిలిపోతుంది....

ఎదురు దెబ్బలు తిన్నవాడు,
నొప్పి విలువ తెలిసిన వాడు
మహనీయుడు అవుతాడు...

ఇతరులను ఇబ్బంది పెట్టేవాడు
ఎప్పటికీ ఉన్నదగ్గరే ఉండిపోతాడు...

డబ్బుతో ఏమైనా
కొనగలమనుకుంటున్నారా
అయితే కొనలేనివి ఇవిగో

మంచం పరుపు కొనవచ్చు
కానీ నిద్ర కాదు

గడియారం కొనవచ్చు
కానీ కాలం కాదు

మందులు కొనవచ్చు
కానీ ఆరోగ్యం కాదు

భవంతున్ని కొనవచ్చు
కానీ ఆత్మీయిత కాదు

పుస్తకాలు కొనవచ్చు
కానీ జ్ఞానం కాదు

పంచభక్ష పరమాన్నాలు కొనవచ్చు
కానీ జీర్ణశక్తిని కాదు.

# వర్షాలు పట్ల అప్రమత్తంగా ఉండాలి



**పార్వతీపురం,సాలూరు, (విశాఖ సమాచారమ్):** వర్షాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గిరిజన శాఖా మాత్యులు శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఒక ప్రకటన శనివారం విడుదల చేశారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఆయా జిల్లా కలెక్టర్లతో మంత్రి మాట్లాడి పరిస్థితులపై ఆరా తీశారు. అప్రమత్తంగా ఉండాలని, యంత్రాంగాన్ని పూర్తి సన్నద్ధం చేయాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో కొండ వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయని, గెడ్డలు, వాగుల ప్రవాహ ఉధృతి దృష్ట్యా ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలనీ అన్నారు. గెడ్డలు, వాగులను ఎవరూ దాటకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. ముందస్తు జాగ్రత్తగా పాఠశాలలకు శెలవు కూడా ప్రకటించామని చెప్పారు. పిల్లలు బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి మంత్రి సంధ్యారాణి విజ్ఞప్తి చేశారు. మత్యకారులు వేటకు వెళ్లకుండా హెచ్చరిక జారీ చేసామని, భారీ వర్షాల నేపధ్యంలో శిథిల భవనాలలో ఎవరు ఉండవద్దని కోరారు. ప్రాణహాని కలగకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించుటకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఆమె ఆదేశించారు. ప్రజలను, సరుకులను తరలించుటకు అవసరమగు రవాణా అనుసంధానం చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలలో ఆహార సరఫరాకు ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. మధ్యాహ్న వంట ఏజెన్సీలను సిద్ధం చేయాలని ఆయన అన్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలను దృష్టిలో పెట్టుకొని వారికి అవసరమగు పాలు, బిస్కెట్లు, రొట్టెలు తదితర సామాగ్రిని సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు.

## ఘనంగా శ్రీ గౌరీ పరమేశ్వరుల ఊంజల సేవ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక గవరపాలెం శ్రీ గౌరీ పంచాయతన దేవస్థానంలో వేంచేసి ఉన్న శ్రీ గౌరీ పరమేశ్వరుల 194వ ఉంజల్ సేవ శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమమునకు దేవాలయ అర్చకులు.అంపోలు గోపాల కృష్ణ శర్మ నేతృత్వంలో వేదవిదులైన పండితులచే నిర్వహించబడింది. ఈ ఉంజల్ సేవలో సూరిశెట్టి శంకర్ కిషోర్ ఉష దంపతులు, మనస్విని, విఖ్యాత ఏకాంక్ష ర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు అతిథులుగా శ్రీ గౌరీ గీత మహిళా మండలి శ్రీ సత్తెమ్మ తల్లి దేవస్థానం మహిళా మండలి, శ్రీ గౌరీ పరమేశ్వరి అమృత వర్షిని పెంతకం శెట్టి సుజాత పాల్గొన్నారు,ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , ఆళ్ళ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్, యల్లపు వెంకటరమణ, ఆళ్ల ప్రసాద్ మరియు పాలకవర్గ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రయివేటు ఆసుపత్రులను తనిఖీ చేయాలి



**విజయనగరం:** జిల్లాలోని ప్రయివేటు ఆసుపత్రులపై నిఘా పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. ఆర్‌డిలతో కలిసి జిల్లాలోని 108 ప్రయివేటు ఆసుపత్రులను తనిఖీ చేసి, తనకు నివేదిక అందజేయాలని డిఎంఅండ్‌హెచ్‌ఓను ఆదేశించారు. స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ చేయించుకున్న వారి వివరాలను పరిశీలించాలని, గర్భస్థ లింగ నిర్ధారణ చేసినవారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గర్భధారణ పూర్వ మరియు గర్భస్థ పిండ ప్రక్రియ చట్టం-1994 అమలుపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం (పిసి అండ్ పిఎన్‌డిటి యాక్ట్) శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. చట్టం అమలును కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఉన్న మొత్తం 88 స్కానింగ్ సెంటర్లపై ఆరా తీశారు. నిపుణులైన వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఇవి నడిచేలా చూడాలన్నారు. అనుమతులు ఇచ్చినప్పుడు కూడా క్షుణ్ణంగా తనిఖీలు చేసి, నిబంధనల ప్రకారం అన్నీ సరిపోయినప్పుడు మాత్రమే స్కానింగ్ సెంటర్లకు అనుమతులు జారీ చేయాలని సూచించారు. జిల్లాలో స్త్రీపురుష నిష్పత్తిలో భారీ తేడాలు, అందుకు కారణాలపై ఆరా తీశారు. ఎట్టిపరిస్థితిలోనూ గర్భస్థ లింగనిర్ధారణ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాలు, అబార్షన్లన్నీ ఖచ్చితంగా పోర్టల్‌లో నమోదు అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆసుపత్రులు అందిస్తున్న సేవలను తనిఖీ చేయాలని సూచించారు. అవకతవకలకు పాల్పడే ప్రయివేటు ఆసుపత్రుల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సేవలను మరింత మెరుగుపర్చేందుకు కృషి చేయాలన్నారు.

ఈ సమావేశంలో మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి ఎం.మీనాదేవి, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ గౌరీ శంకర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పివిఎన్ జయలక్ష్మి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, దిశ సిఐ నాగేశ్వర్రావు, నేచర్ ఎన్‌జిఓ ప్రతినిధి ఎస్.వికాశ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే కొణతాల



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక దేముని గుమ్మం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్ర ఉత్సవాల సందర్భంగా శనివారం అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే రామకృష్ణ ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ నిర్వహకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు.ఈఉత్సవంలో అంతర్భాగంగా జరుగుతున్న చక్రాబ్జామండలార్చన , హెూమం కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు ఎమ్మెల్యే స్వీకరించారు వారితోపాటు ఆలయ పర్యవేక్షకులు సకల గోవిందరావు ఆలయ అర్చకులు పులకండంవిజయ్ బాబు పులకడం గిరిబాబు పాల్గొన్నారు. వీరితోపాటు జనసేన నాయకులు పీలా నాగ శ్రీను, భీమరశెట్టి చిన్ని, దూలం గోపి, గోలి మురళి తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పటిష్ట చర్యలు తీసుకుంటాం





**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా ఇంతకుమునుపు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా పనిచేసిన విక్రాంత్ పాటిల్, ఐపియస్ కాకినాడ జిల్లా ఎస్పీగా బదిలీ కావడంతోఆయనస్థానంలోఎస్.వి.మాధవరెడ్డి, ఐపియస్ పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవరెడ్డి,ఐపియస్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మొదటగా ఏఆర్ సిబ్బందిచే గౌరవవందనం స్వీకరించి, తదుపరి వేద మంత్రోచ్ఛారణల నడుమ బాధ్యతలు చేపట్టినారు, పూరోహితులు ఆశీస్సులు అందజేశారు. అదనపు ఎస్పీ డా . ఓ. దిలీప్ కిరణ్ ,పార్వతీపురం ఎస్ డి పి ఓ సునీల్ షరోన్,ఐపిఎస , పాలకొండ ఎస్ డి పి ఓ జి.వి.కృష్ణా రావు స్వాగతం పలికి, పుష్పగుచ్ఛాలుతో అభినందనలు తెలియచేసారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలోని మిడియాతో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా రావడం తనకు చాలా సంతోషంగా ఉందని,పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉప-ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. జిల్లాలోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి అందరిసహకారంతో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. జిల్లాలో గిరిశిఖర ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు, అసాంఘిక కార్యకలాపాలు నివారణ, అక్రమ మద్యం నివారణ, నాటుసారా నివారణ, గంజాయి రవాణావంటి కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. జిల్లాలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంద్వారా ప్రజలు అందజేసే సమస్యలను తెలుసుకొని చట్టపరంగా పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానన్నారు. జిల్లాను ప్రశాంతంగా ఉంచేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకారం తీసుకుంటూ ,జిల్లా యంత్రాంగం, పోలీసు సిబ్బందిని సమన్వయం చేసుకుని ముందుకెళ్తాం అని మరియు మీడియా వారు తమ వంతు సహాకారం అందించాలని కోరుకుంటున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ డా . ఓ. దిలీప్ కిరణ్ ,పార్వతీపురం ఎస్ డి పి ఓ సునీల్ షరోన్,ఐపిఎస , పాలకొండ ఎస్‌డిపిఓ జి.వి.కృష్ణా రావు, ఎస్బి సిఐ సిఎచ్.లక్ష్మణరావు,డిసిఆర్బి సిఐ బి.ఎం.డి.ప్రసాద్, ,పార్వతీపురం పట్టణ, గ్రామీణసిఐలు కృష్ణారావు, రవికుమార్,జిల్లా సిఐలు, ఆర్ ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, డిపిఒ, ఎస్బి, డిసిఆర్బి విభాగాల సిబ్బంది జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి సింహగిరి ప్రదక్షిణ మహెూత్సవం-2024



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మి నరసింహ స్వామి గిరి పౌర్ణమి మహెూత్సవం సందర్భంగా శనివారం జరిగే గిరి ప్రదర్శనలో భాగంగా సింహాచలం తొలి పాంచా వద్ద స్వామివారికి కొబ్బరికాయ కొట్టి శ్రీ వరాహ నరసింహస్వామి వారి రథము తో భక్తులు బయలుదేరి 32 కిలోమీటర్లు మూడు లక్షల మంది భక్తులు నడుచుకుంటూ మరల సింహాచలం కొండ దిగువన స్వామి వారి తొలి పాంచా వద్ద కొబ్బరికాయ కొట్టి వాళ్ళు మొక్కలు ముగించుకుంటారు ఈ క్రమంలో విశాఖపట్నం బిజినెస్ నెట్వర్క్ ఇంటర్నేషనల్ ఛాంపియన్స్ BNI champions group సభ్యులు వారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నవరం నుంచి తీసుకువచ్చిన 150 కేజీలు అన్నవరం ప్రసాదం అలాగే 1000 కేజీలు పులిహార 20000 వేలు డ్రింక్ బాటిల్స్ 200 వాటర్ క్యాన్స్ 100 లీటర్ల పాలు టీ లతో భక్తులకు సీతమ్మధార మెయిన్ రోడ్డు ప్రెస్టేజ్ షాప్ ముందు నాలుగు సంవత్సరముల నుండి ఈ ప్రసాద పంపిణీ ఇవ్వడం జరుగుతుంది ఈ బి ఎస్ ఐ చాంపియన్స్ గ్రూప్ లో ఉన్న శ్రీధర్ మణికంఠ స్వామి అచ్యుతరామరాజు మోహన్ రాజు ఖాదర్ సాంతిల్ రామకృష్ణ రవితేజ రాము 56 మంది సభ్యులు సుమారు 5 లక్షల రూపాయలు సమకూర్చుకొని భారీ ఎత్తున శ్రీ వరాహ నరసింహస్వామి వారి వెరీ పౌర్ణమి యాత్రలో పాల్గొన్న భక్తులందరికీ ఈ ప్రసాద పంపిణీ జరపడం జరిగింది ఇలాగే ప్రతి సంవత్సరం కూడా శ్రీ వరహాల లక్ష్మి నరసింహ స్వామి వారి సేవలో పాల్గొంటామని తెలిపారు

## పరీక్షల విభాగాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారు
## అందరి సహకారంతో విద్యార్థులకు సమర్ధ సేవలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయం పరీక్షల విభాగాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారని ఏయూ పరీక్షల విభాగం డీన్‌గా పనిచేసి ఆంధ్రకేసరి వర్సిటీ ఇంచార్జి వీసీగా నియమితులైన ఆచార్య డి.వి.ఆర్ మూర్తి అన్నారు. శనివారం పరీక్షల విభాగంలో ఆచార్య డి.వి.ఆర్ మూర్తికి ఆత్మీయ సత్కారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆచార్య డి.వి.ఆర్ మూర్తి మాట్లాడుతు ఉద్యోగులందరి సహకారంతో సమర్థవంతంగా సేవలు అందించడం జరుగుతోందన్నారు. భవిష్యత్తులో సైతం విద్యార్థులకు మరింత సమర్థవంతమైన, సత్వర సేవలు అందించే విధంగా సిబ్బంది పనిచేయాలని సూచించారు. పరీక్షల విభాగంతో తనకున్న అనుబంధాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సెంటర్ సంచాలకులు ఆచార్య భాస్కర రెడ్డి, సిఈ టి. చిట్టిబాబు, డి.ఆర్ జె.రత్నం, పద్మరాజు, సూపరిండెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య డి.వి.ఆర్ మూర్తిని ఆర్ట్స్ కళాశాల ఆచార్యులు ఘనంగా సత్కరించారు. తమ కళాశాల ఆచార్యునికి ఇంచార్జి వీసీగా పదవి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహా రావు జర్నలిజం విభాగాధిపతి ఆచార్య సి.ఎం వినయ కుమార్, ఆచార్య చల్లా రామకృష్ణ, డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వాల్తేర్ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనియన్ జనరల్ బాడి సమావేశం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నేషనల్ మజ్దూర్ యూనియన్ విశాఖ జిల్లా రీజినల్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు వాల్తేర్ డిపోలో జనరల్ బాడి సమావేశం నిర్వహించడం జరిగింది. అందులో డిపోలో టిమ్ సమస్యలు వెహికల్ కండిషన్ రన్నింగ్ టైం సరిపడని రూట్లు రెస్ట్ రూమ్ సౌకర్యాలు తప్పుడు కంప్లైంట్స్ టి.టి.ఐ అక్రమకేసులు వ్రాసే విధానం నాయకులు కార్యకర్తలపై కక్ష్య సాధింపు చర్యలు కౌన్సిలింగ్ పేరిట వేధింపులు యాజమాన్య వైఖరిపై తీవ్ర స్థాయిలో చర్చ జరిగి అందరూ ముక్త కంఠంతో ద్వజమెత్తారు.దీనిపై వెంటనే యాజమాన్యానికి లెటర్ ఇచ్చి అవసరమైతే ఉద్యమంనకు అందరూ సిద్ధం కావాలని తీర్మానం జరిగింది. ఈ సమావేశంనకు ముఖ్య అతిథులుగా జోనల్ కార్యదర్శి యం.వి.అర్.మూర్తి రీజినల్ కార్యదర్శి బి.నీలకంఠం డివిజన్ కార్యదర్శి ఎ.కె.శివాజీ హాజరయ్యారు డిపో అధ్యక్ష కార్యదర్శులు అర్.వసంతరావు పి.జి.పతి చైర్మన్ బి.రవి డివిజనల్ జాయింట్ సెక్రటరీ జి. రాధా కృష్ణ అధిక సంఖ్యలో కార్మికులు మహిళలు పాల్గొన్నారు సమావేశ అనంతరం డిపో అసిస్టెంట్ సెక్రటరీ డి.యస్.అర్.రాజు సమావేశానికి హాజరైన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం పునర్నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కొణతాల



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి శాసనసభ్యులు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ గవరపాలెంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగస్టు చివరివారంలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ జూనియర్ సబ్ జూనియర్ సీనియర్ మహిళలు మరియు పురుషులు విభాగాలలో పోటీలు జరగనున్నాయని అన్నారు. పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి గుమ్మాల వెంకటరమ, గుమ్మాల నాగేశ్వరరావు ప్రసాదుల శ్రీను జనసేన నాయకులు పీలా నాగ శీను వాకాడ బాబు నల్లల రాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు తమ పంటను డైరెక్టుగా (ఎఫ్ పి ఒ) అమ్ముకునే విధానం ద్వారా రైతులకు మేలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పండించే రైతులు తమ పంటను డైరెక్టుగా అమ్ముకునే విధానం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ) డిస్ట్రిక్ట్ లెవెల్ మోనటరింగ్ కమిటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో గల వివిధ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో, రైతులు పండించే పంటలు, వాటి మార్కెటింగ్ అవకాశాలతో పాటు రైతు పండించిన పంటను స్టోరేజ్ చేసే అవకాశాలు గురించి చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు అధిక లాభాలు వచ్చే విధంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దళారీ వ్యవస్థ ద్వారా రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అవసరమైన అనుమతులు, సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు.

ఈ సమావేశంలో నాబార్డ్, హార్టికల్చర్, అగ్రికల్చర్, డిఆర్ డిఎ, ఫిషరీస్ శాఖల అధికారులు, ఎల్.డి.ఎమ్., వివిధ రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## డైట్ లో హై పెరఫార్మెన్స్ కంప్యూటింగ్ పై వర్క్షాప్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్ కళాశాలలో శనివారం నాడు సి.యస్.ఈ విభాగంలో హై పెరఫార్మెన్స్ కంప్యూటింగ్ (హెచ్ పి సి) వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథీ గా ఏఐసిటిఈ- సంకల్ప్ రిసోర్స్ పర్సన్ డాక్టర్. టి. సత్యనారాయణ మూర్తి సి బి ఐ టి - హైదరాబాద్ నుండి విచ్చే సారు. ముందుగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ కంప్యూ టర్ సైన్స్ ఇంజనీరింగ్ లో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని వాటిని విద్యార్థులు తమ నైపుణ్యాలను పెం పొందించుకోవడము ద్వారా ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. వైకుంఠరావు మాట్లాడుతూ కంప్యూటర్ ఇంజనీరింగ్ రంగంలో అనేక నూతన ఆవిష్కరణలు జరుగు తున్నాయని వాటిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని తద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగు పరుచు కోవాలని తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. కె. సుజాత మాట్లాడుతూ కంప్యూటర్ ఇంజనీరింగ్ విద్యార్థులు టెక్నికల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగు పరుచుకోవాలని శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్నా నూతన టెక్నాలజీ లను నేర్చుకుంటూ విద్యార్థులు ప్రతిభను మెరుగు పరుచుకోవాలని తద్వారా ఉన్నత స్థాయిని సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథిదిగా విచ్చేసిన డా.టి. సత్యనారా యణ మూర్తి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ రంగంలో సంక్లిష్ట గణన సవాళ్లను ఎదుర్కోవడానికి సమకాలీన పరిశోధన మరియు పరిశ్రమలో కీలకమైన అంశం - అధిక-పనితీరు గల కంప్యూటింగ్ రంగాన్ని ప్రకాశవంతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వర్క్షాప్ విద్యార్థులకు అంతర్గతంగ నైపుణ్యాలను పొందేందుకు ఒక ప్రత్యేక వేదికను అందిస్తుంది. అనంతరం ముఖ్య అతిధి డా. టి. సత్యనారాయణ మూర్తి కళాశాల చైర్మన్ రత్నాకర్, ప్రిన్సిపాల్ వైకుంఠ రావు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కే. సుజాత శాలువ తో ఘనంగా సత్కరించి , మెమెంటో అందచేశారు.ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. శ్యామ్ ప్రసాద్ , డాక్టర్ ఈశ్వర రావు , అకడమిక్ కో- ఆర్డినేటర్ కృష్ణ నాగ్ , వివిధ విభాగాధిపతులు , అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి ఘనంగా అభిషేకాలు





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలో ప్రసిద్ధి చెందిన దేముని గుమ్మం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాలలో భాగంగా శనివారం నాలుగవ రోజు ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం విజయబాబు పులఖండం గిరిబాబు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో వేద పండితులు స్వామి వారికి ఉదయం సుప్రభాత సేవ, స్వామివార్ల ఉత్సవ మూర్తులకునవకలశ స్నపనం, అభిషేకం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వాసుదేవ అన్నమయ్య సంకీర్తనలు, శివకేశవుల అన్నమయ్య కోలాటక బృందం అన్నమయ్య కీర్తనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో, ఆలయ కార్య నిర్వహణ అధికారి రాజ సులోచన, ఆలయ పర్యవేక్షకులు సకల గోవిందరావు, పులఖండం ప్రసాద్ బాబు, పులఖండం రాజేష్ బాబు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఎం ఎస్ ఎం ఈ కేంద్రాలు పెట్టడానికి ప్రతిపాదనలు పరిశీలన



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఎంఎస్ఎం ఈ శిక్షణా కేంద్రాలను రాష్ట్రవ్యాప్తంగా పెట్టడానికి పరిశీలన చేస్తున్నట్లు ఎం ఎస్ ఎం ఈ రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి లో ఏర్పాటు చేసిన ఎం ఎస్ ఎం ఈ శిక్షణా కేంద్రాన్ని శుక్రవారం ఉదయం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులతోనూ శిక్షణ పొందుతున్న విద్యార్థులతోనూ ఎం ఎస్ ఎం ఈ ఉద్యోగులతో ఆయన సమావేశం అయ్యారు. ఎం ఎస్ ఎం ఈ టెక్నాలజీ సెంటర్ విధి విధానాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ముందుగా శిక్షణ కేంద్రంలో ప్రస్తుతం ఉన్న అభివృద్ధి, విద్యార్థులకు ఎదురవుతున్న సమస్య లను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ దేశవ్యాప్తంగా 15 ఎం.ఎస్.ఎం.ఇ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారని, వాటిలో ఒకటే ఏపీ ఎస్ సి జెడ్ అచ్యుతాపురం లో ప్రారంభించారని ఆయన గుర్తు చేశారు. ఈ శిక్షణా కేంద్రం అద్భుతంగా పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ శిక్షణ కేంద్రం 2000 మందితో ప్రారంభించడం జరిగిందని, ప్రస్తుతం 3000 మంది శిక్షణ పొందుతున్నారని మంత్రి తెలిపారు. 5000 మందికి శిక్షణ పెంచాలని ప్రతిపాదన చేస్తున్నట్లు ఆయన చెప్పారు. 8వ తరగతి కనీస విద్యార్హతో ప్రారంభమై ఎంటెక్ చదివిన వారికి ఈ శిక్షణ సంస్థలో ప్రవేశం జరుగుతుందన్నారు. శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు చూపెట్టడం జరుగుతుందని చెప్పారు. ఎం ఎస్ ఎం ఈ శిక్షణ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించాలనే విషయాన్ని చర్చించారు. ఎస్ ఈ జెడ్ నెలకొల్పిన ఈ శిక్షణా కేంద్రానికి,ఎక్సెన్షన్ కేంద్రాలుగా జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయడానికి ఆలోచిస్తున్నట్లు ఆయన తెలిపారు. తద్వారా ఏ జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులకు అదే జిల్లాలో అక్కడ అవసరాల బట్టి శిక్షణతో పాటు ఉపాధి కల్పించడానికి అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, విశాఖ జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ గణపతి, అనకాపల్లి, ఆటోనగర్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** స్మశాన వాటికలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆదేశాలు మేరకు పారిశుధ్యాన్ని తొలగిస్తునట్లు తెలుగుదేశం యువ నాయకుడు రాపాక అనంత్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం పార్వతీపురం మునిసిపల్ పరిధిలో 22,23, వార్డులలో ఉన్న స్మశాన వాటికలో అపరిశుధ్యాన్ని తొలగించమన్నారు. అలాగే వార్డులలో కల్వాలలో ఉన్న సిల్ట్ ను తొలగించి పారిశుధ్యాన్ని దూరంగా డంపింగ్ యార్డ్ కు తరలిస్తామన్నారు. వార్డ్ లలో ఎప్పటి కప్పుడు మంచి నీటి వనరులు దగ్గర, కల్వరట్లలో బ్లీడింగ్ వేసి క్లోరినేషన్ చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమం లో టి డి పి కార్యకర్తలు, యువత వార్డ్ మేబర్లు తదితరులు పాల్గొన్నారు.

## గిరి ప్రదక్షిణ భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసిన ఒమ్మి సన్యాసిరావు, బుడుమూరిగోవింద్



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** విశాఖతూర్పు, శ్రీ శ్రీ శ్రీ సింహాద్రి అప్పన్న గిరి ప్రదర్శన సందర్భంగా, పెదగదిలి జంక్షన్ వద్ద, భక్తులకు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఒమ్మి సన్యారావు గారు, మరియు పార్లమెంట్ పార్టీ, ఎస్సా సెల్, అధ్యక్షులు, బుడుమూరి గోవింద్ల ఆధ్వర్యంలో, కౌంటర్లు ఏర్పాటుచేసి, సమోసాలు, బిస్కెట్స్, టీ, మజ్జిగ, గోవింద్ కౌంటర్లో, వెజ్ బిరియాని, రవ్వ కేసరి, పులిహోర, పాలు, పంపిణి చేసిరి, ఈ పంపిణిలో, వెలగపూడి రుద్ర ప్రతాప్, 12,వార్డు అధ్యక్షులు, గాడి సత్యం, పార్లమెంట్ పార్టీ ఆర్గనైజింగ్సెక్రటరీ, ఒమ్మి పోలరావు, 11వ వార్డు ఇంచార్జి, రాగతి అచ్చుతారావు, ఐటీడీపి, బాధరు బాలరాజు నాయకులు పాల్గొన్నారు.

## ముడసర్లోలోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరి భక్తులకు ప్రసాద వితరణ చేపట్టిన నగర మేయర్ దంపతులు



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి కృప గిరి ప్రదక్షిణ భక్తులపై ఉండాలని కోరుకున్నట్లు నగర మేయర్ గొలగాని హరి వెంకట్ కుమారి దంపతులు పేర్కొన్నారు.

శనివారం మేయర్ దంపతులు ముడసరిలోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముడసర్లోలోవ స్కిల్ డెవలప్మెంట్ ప్రాంతంలో సింహాచలం గిరి ప్రదక్షిణ భక్తుల కొరకు ఏర్పాటుచేసిన ప్రసాద వితరణలో పాల్గొని గిరి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఈ సందర్భంగా నగర మేయర్ దంపతులు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఆరాధ దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి సింహాచల గిరి ప్రదక్షిణకు లక్షలాదిమంది భక్తులు వచ్చారని, వారి కొరకు ఎంతోమంది భక్తులు స్వచ్ఛంద సంస్థలు అసోసియేషన్స్ ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారని, ముఖ్యంగా ముడసరిలోవ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పులిహోర, బూరెలు భక్తులకు అందించారని వారందరికీ ఆ లక్ష్మీనరసింహస్వామి కృప ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

## శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆషాడ పౌర్ణమి పూజలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిష్ఠా శతజయంతి ఉత్సవాలుఆషాడమాసం, పౌర్ణమి శనివారం సందర్భంగా అమ్మవారి నగర సంకీర్తన అమ్మవారి నామ సంకీర్తనలతో పట్టణ పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు నిర్వహించారు, రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో గోపూజ,ప్రదక్షిణలు, అమ్మవారికి మూల విరాట్ కు పంచామృత అభిషేకం, నవకలశ స్నపనము, కార్యక్రమము, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాదములు ఘనంగా జరిగాయి. రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో అమ్మవారికి 49 కలశములతో స్నపనము, అమ్మవారికి పంచామృత అభిషేకాలు శాంతి హెూమం, వరంగల్ నిర్వహించారు. కాకినాడ వాస్తవ్యులు యం.అంత్యాక్షరిలో గిన్నిస్ బుక్ ఆఫ్ అవార్డు గ్రహీత గ్రంధి తాయారు నారాయణీయము ప్రవచనాలు భక్తులు ఎంతగానో ఆకట్టుకుంది

ఈ కార్యక్రమంలో. ప్రతిష్ట శత జయంతి ఉత్సవములచైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషు కుమార్, ఆలయ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణ



కుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు. ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సినిమా



## ప్రభాస్ - పవన్.. మళ్ళీ కనిపించేది అప్పుడే..






డార్లింగ్ ప్రభాస్ ఈ ఏడాదిలో కల్కి 2898ఏడీ సినిమాతో టాలీవుడ్ కి 1000 కోట్ల మూవీ అందించాడు. ఆర్ఆర్ఆర్ తర్వాత మళ్ళీ టాలీవుడ్ పేరు దేశం మొత్తం వినిపించేలా కల్కి సినిమాతో ప్రభాస్ చేశాడు. అలాగే హీరోగా తన మార్కెట్ ని కూడా యంగ్ రెబల్ స్టార్ అమాంతం పెంచుకున్నాడు. నెక్స్ట్ అతని లైన్ అప్ లో ఐదు సినిమాలు ఉన్నాయి. ప్రతి ఏడాది రెండు సినిమాలు రిలీజ్ చేస్తానన్న ప్రభాస్ ప్రామిస్ ఈ ఏడాది సాధ్యం అయ్యేలా లేదు. నిజానికి మారుతి దర్శకత్వంలో చేస్తోన్న రాజాసాబ్ మూవీని 2024 డిసెంబర్ లో రిలీజ్ చేయాలని అనుకున్నారు. అయితే అది సాధ్యమయ్యేలా కనిపించడం లేదంట. షూటింగ్ ఇంకా చాలా వరకు పెండింగ్ ఉంది. తరువాత పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ఉంది. ఈ సినిమాకి కూడా సీజీ వర్క్ బాగానే ఉందంట. అందుకే డిసెంబర్ లో వీలు కాదని అనుకుంటున్నారు. మళ్ళీ డార్లింగ్ ప్రభాస్ ప్రేక్షకులని పలకరించేది 2025 సమ్మర్ లోనే అని తెలుస్తోంది. రాజాసాబ్ సినిమాని ఏప్రిల్ లో రిలీజ్ చేయాలని అనుకుంటున్నారంట. ఆ తరువాత 2025 ఆఖరులో సలార్ పార్ట్ 2 రిలీజ్ అవ్వొచ్చనే టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ మూవీ ఈ ఏడాదిలో రిలీజ్ అవుతుందని అందరూ భావించారు. అయితే ఏపీ ఎన్నికలలో అఖండ మెజారిటీ సాధించి పవన్ కళ్యాణ్ కీలక బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ సీఎంగా ఆయన అధికారిక కార్యక్రమాలు చాలా నిర్వహిస్తున్నారు. మరో మూడు, నాలుగు నెలల వరకు సినిమాలకి సమయం కేటాయించలేనని పవన్ కళ్యాణ్ తేల్చేశారు. దీంతో ఓజీ మూవీ రిలీజ్ వాయిదా పడింది. పవన్ కళ్యాణ్ ఓ 25 రోజులు డేట్స్ ఇస్తే సినిమా షూటింగ్ ఆల్ మోస్ట్ కంప్లీట్ అయిపోతుందంట. అయితే ఎప్పుడు పవన్ కాల్ షీట్స్ ఇస్తారనేది క్లారిటీ లేదు. అందుకే ఓజీ సినిమాని 2025 సమ్మర్ లో రిలీజ్ చేయాలని సుజిత్ టీమ్ ప్లాన్ చేసుకుంటుంది. ఈ లోపు పవన్ కళ్యాణ్ ఇచ్చే డేట్స్ అడ్జస్ట్ చేసుకొని షూటింగ్ ఫినిష్ చేయాలని అనుకుంటున్నారు. ఓజీ మూవీ తర్వాతనే హరిహరవీరమల్లు రిలీజ్ అవ్వొచ్చనే టాక్ వినిపిస్తోంది. నిర్మాత ఏఎం రత్నం అయితే డిసెంబర్ లో రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. పవన్ కళ్యాణ్ డేట్స్ అప్పటికి అడ్జస్ట్ అవుతాయా, పెండింగ్ షూట్ కంప్లీట్ అవుతుందా అనేది తెలియదు. ఈ పరిస్థితిలో డార్లింగ్ ప్రభాస్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ని మరల వచ్చే ఏడాది సమ్మర్ లోనే థియేటర్స్ లో చూసే ఛాన్స్ ఉందని సినీ విశ్లేషకులు అంటున్నారు.

## పుష్ప 2 సైడ్ ఇస్తే.. కాచుకొని ఉన్నారు..



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప ది రూల్ మూవీ మూడేళ్ళ నుంచి షూటింగ్ స్టేజ్ లో ఉంది. ఈ చిత్రం కోసం బన్నీ ఫ్యాన్స్‌తో పాటు పుష్పరాజ్ ని ఇష్టపడే వారు కూడా వెయిట్ చేస్తున్నారు. హిందీలో పుష్ప ది రూల్ మీద హై ఎక్స్ పెక్టేషన్స్ ఉన్నాయి. భారీ బడ్జెట్ తో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. సుకుమార్ కూడా ఎలాంటి పొరపాట్లు లేకుండా పెర్ఫెక్ట్ గా మూవీని చెక్కే పనిలో ఉన్నారు. అయితే గత కొద్ది రోజుల నుంచి సుకుమార్, బన్నీకి మధ్య గ్యాప్ పెరిగిందనే ప్రచారం తెరపైకి వచ్చింది. సినిమా షూటింగ్ ఎక్కువ టైం తీసుకోవడం వలన బన్నీ డిజప్పాయింట్ అయ్యాడనే టాక్ నడుస్తోంది. అయితే తాజాగా అల్లు అర్జున్ ఫ్రెండ్ బన్నీ వాస్ ఈ రూమర్స్ కి ఫుల్ స్టాప్ పెట్టాడు. పుష్ప 2 ఎడిటింగ్ పైన ప్రస్తుతం సుకుమార్ ఉన్నారని తెలిపారు. ఇంకా బన్నీకి సంబంధించిన సీక్వెల్స్ షూట్ 15 రోజులు మాత్రమే ఉన్నాయని. మెజారిటీ సీన్స్ ఫాహద్ ఫాజిల్ కి సంబంధించినవి తెరకెక్కించాల్సి ఉందని తెలిపారు. నెల రోజుల ఫ్యామిలీ ట్రిప్ కోసం బన్నీ కాస్త ట్రిమ్ చేసుకున్నారని తెలిపారు. అల్లు అర్జున్ నెక్స్ట్ షెడ్యూల్ కి చాలా టైం ఉందని, ఆ లోపు మళ్ళీ పుష్ప లుక్ లోకి తిరిగొస్తారని క్లారిటీ ఇచ్చారు. సుకుమార్ మరో ఆరు నెలలు షూటింగ్ ఉంటుందని చెప్పిన అల్లు అర్జున్ చేస్తాడని బన్నీ వాస్ చెప్పాడు. దీంతో ఆల్ మోస్ట్ రూమర్స్ కి ఫుల్ స్టాప్ పడినట్లే. సెప్టెంబర్ నాటికి పుష్ప ది రూల్ షూటింగ్ ఆల్ మోస్ట్ ఫినిష్ అయ్యే ఛాన్స్ ఉందంట. డిసెంబర్ 6న రిలీజ్ పక్కా అని భావిస్తున్నారు. ఏవైనా కారణాల వలన పుష్ప ది రూల్ వాయిదా పడితే ఆ డేట్ లో రావడానికి ఇద్దరు స్టార్స్ సిద్ధంగా ఉన్నారు. అలాగే మరో రెండు సినిమాలు కూడా అదే డేట్ కి రిలీజ్ అయ్యే ఛాన్స్ ఉందంట. మంచు విష్ణు తన డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్పని పాన్ ఇండియా లెవల్ లో తెరకెక్కిస్తున్నారు. డిసెంబర్ లో మూవీ రిలీజ్ ఉంటుందని తాజాగా కన్ఫర్మ్ చేశారు. అయితే డేట్ ఫిక్స్ చేయలేదు. పుష్ప 2 వాయిదా పడితే ఆ డేట్ కి కన్నప్ప తీసుకురావాలని అనుకుంటున్నాడంట. ఒక వేళ పుష్ప 2 రిలీజ్ అదే టైంకి ఉంటే మరో డేట్ ని డిసెంబర్ లోనే ఫిక్స్ చేయాలని అనుకుంటున్నట్లు టాక్ అలాగే నందమూరి నటసింహ బాలకృష్ణ NBK 109 సినిమా షూటింగ్ దశలో ఉంది. బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ హైవోల్టేజ్ యాక్షన్ మూవీని డిసెంబర్ లోనే రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. వీరు కూడా పుష్ప 2 వాయిదా పడుతుందనే హోప్ తో ఉన్నారు. ఒకవేళ డిసెంబర్ 6న పుష్ప 2 రిలీజ్ కచ్చితంగా వస్తుంది అనుకుంటే NBK 109 రిలీజ్ డేట్ పై మేకర్స్ పునరాలోచన చేసే అవకాశం ఉందంట.

## రాధేశ్యామ్ బ్యూటీ అందాల జాతర.. బికినీతో అలా..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన రాధేశ్యామ్ మూవీలోని ఆర్చర్ తారా గుర్తుందా? అదేనండీ రిద్ధి కుమార్. సినిమాలో తళుక్కున మెరిసిన ఈ ముద్దు గుమ్మ.. మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఇప్పుడు మరోసారి ప్రభాస్ తో స్క్రీన్ షేర్ చేసుకుంటున్న విషయం తెలిసిందే. ప్రభాస్ హీరోగా దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న రాజా సాబ్ మూవీలో రిద్ధి కీలక పాత్ర పోషిస్తున్నట్లు టాక్ వస్తోంది. ప్రభాస్ తో చిందులు కూడా వేయనుందట. అయితే యంగ్ హీరో రాజ్ తరుణ్ లవర్ మూవీతో సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన రిద్ధి.. ఆ సినిమాలో తన అందం, అభినయంతో కుర్రాళ్లను కట్టిపడేసింది. ఆ తర్వాత చాలా గ్యాప్ తీసుకుని రాధేశ్యామ్ లో నటించింది. తెలుగుతోపాటు ప్రణయ మీనుకలుడే కాదల్ తో మలీవుడ్ లోకి, దండంతో మరాఠీ ఇండస్ట్రీల్లోకి కూడా ఎంట్రీ ఇచ్చి తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది రిద్ధి కుమార్. చివరగా హ్యూమన్ అనే వెబ్ సిరీస్ లో కనిపించింది. ఇప్పుడు రాజా సాబ్ తోపాటు పలు మలయాళ చిత్రాల్లో నటిస్తోంది అమ్మడు. టాలీవుడ్ లో మరిన్ని అవకాశాలు అందుకోవడానికి ట్రై చేస్తోంది. అదే సమయంలో సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటోంది రిద్ధి. తరచూ గ్లామరస్ పిక్స్ ను షేర్ చేస్తుంటోంది. వరుస ఫోటో షూట్స్ ను పోస్ట్ చేస్తూ కుర్రకారు మతులు పోగుడుతుంటోంది. వెకేషన్స్, ట్రిప్స్ కు వెళుతూ అక్కడి విశేషాలు, పిక్స్ ను పంచుకుంటోంది రిద్ధి కుమార్. తాజాగా ఈ బ్యూటీ నేచురల్ లొకేషన్ కు వెళ్లింది. ఓ జలపాతాన్ని విజిట్ చేసింది. అందుకు సంబంధించిన పిక్స్ తోపాటు వీడియోస్ ను షేర్ చేసింది. ఆ సమయంలో గ్రీన్ కలర్ బికినీ వేసుకున్న అమ్మడు.. ఫౌంటెయిన్ వద్ద ఓ రేంజ్ లో ఎంజాయ్ చేసినట్లు కనిపిస్తోంది. జలపాతం రాళ్ల వద్ద బికినీతో పోజులిచ్చి మైండ్ బ్లాక్ చేస్తోంది. ఎద అందాలతో కవ్విస్తూ.. నవ్వుతూ అందరినీ మాయ చేస్తోంది. స్టన్నింగ్ పోజులతో నెట్టింట సెగలు పుట్టిస్తోంది. జలపాతం వద్ద ఎంజాయ్ చేశాక.. రెయిన్ కోట్ వేసుకుని వెళ్తున్న పిక్స్ ను కూడా షేర్ చేసింది. అందులో క్యూట్‌గా కనిపిస్తూ ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం రిద్ధి పిక్స్ సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతున్నాయి. బ్యూటీ గ్లామర్ ట్రీట్ అదిరిపోయిందని నెటిజన్లు చెబుతున్నారు. అమ్మడి అందాలకు క్లీన్ బౌల్డ్ అయ్యామని అంటున్నారు. వయ్యారి భామ పిక్స్ సూపర్ అని కామెంట్స్ పెడుతున్నారు. మరి ఈ బ్యూటీ జలకాలాటను మీరు చూశారా?

## పూనమ్ స్టన్నింగ్ లుక్స్.. మైండ్ బ్లాకే



పూనమ్ బజ్వా.. ఈ బ్యూటీ గుర్తుందా? మొదటి సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది ఈ బ్యూటీ. ఎవరైనా మొదటి సినిమాతోనే ఎంట్రీ ఇస్తారు కదా అని అనుకోవద్దు. ఆమె యాక్ట్ చేసిన ఫస్ట్ మూవీ పేరే మొదటి సినిమా. సుమారు 19 ఏళ్ల క్రితం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆ సినిమాలో క్యూట్ గా కనిపిస్తూ అందరినీ ఆకట్టుకుంది. అందం, అభినయంతో అలరించింది. కుర్రాళ్ల మనసులు దోచేసింది. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించింది. మోడల్ గా మంచి పేరు సంపాదించుకున్న పూనమ్.. మొదటి సినిమా తర్వాత కింగ్ నాగార్జున బాస్ తో పాటు ప్రేమంటే ఇంతే, వేడుక, పరుగు సినిమాల్లో యాక్ట్ చేసి మెప్పించింది. కానీ సరైన హిట్ అందుకోలేకపోయింది. దీంతో వేరే భాషల్లో పలు సినిమాలు చేసింది అమ్మడు. టాలీవుడ్ కన్నా కోలీవుడ్ లోనే ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది. స్టార్టింగ్ లో స్కోప్ ఉన్న రోల్స్ అందుకున్నా.. ఆ తర్వాత చిన్న చిన్న పాత్రలకు పరిమితమైంది. చివరగా తెలుగులో ఎన్టీఆర్ కథానాయకుడు మూవీలో యాక్ట్ చేసింది. ఇప్పుడు రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పలు తమిళ, మలయాళ చిత్రాల్లో కూడా నటిస్తోంది. కెరీర్ సంగతి ఎలా ఉన్నా.. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది పూనమ్. ఓ రేంజ్ లో సందడి చేస్తుంటోంది. రోజురోజుకు ఫాలోవర్స్ ను పెంచుకుంటోంది. పర్సనల్ కమ్ ప్రొఫెషనల్ విషయాలను షేర్ చేసుకుంటూ నెటిజన్లతో టచ్ లో ఉంటోంది. ఎప్పటికప్పుడు గ్లామరస్ పిక్స్ ను పోస్ట్ చేస్తూ.. కుర్రాళ్లకు నిద్ర లేకుండా చేస్తోంది. పొట్టి పొట్టి డ్రెస్సులు, మోడ్రన్ ఔట్ ఫిట్స్ లో అందాలు ఆరబోస్తుంటోంది. అదిరిపోయే పోజులు ఇస్తూ మైమరపిస్తుంటోంది. తన బ్యూటినెస్ తో ఫిదా చేస్తుంటోంది. ఇటీవల శారీతో సర్ప్రైజ్ ఇచ్చిన అమ్మడు.. ఇప్పుడు మరోసారి బ్లాక్ కలర్ డ్రెస్ లో స్కిన్ షోతో అదరగొట్టేసింది. కుర్చీలో కూర్చుని స్టిల్స్ ఇస్తూ మైండ్ బ్లాక్ చేస్తోంది. ఎద అందాలతో నెటిజన్లను కవ్విస్తోంది. హెయిర్ లీవ్ చేసుకుని ఓరగా చూస్తూ అందరినీ ఫ్లాట్ చేస్తోంది పూనమ్. థైస్ షోతో కుర్రకారును ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రస్తుతం పూనమ్ కొత్త పిక్స్.. సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. అమ్మడి అందానికి దాసోహమయ్యామని నెటిజన్లు చెబుతున్నారు. గ్లామర్ కు కేరాఫ్ అడ్రస్ పూనమ్ అంటూ కామెంట్స్ పెడుతూ రచ్చ రచ్చ చేస్తున్నారు. లైకుల వర్షం కురిపిస్తూ కామెంట్స్ సెక్షన్

## యంగ్ టైగర్ కి పోటీగా అతడు దిగుతున్నాడా?




యంగ్ టైగర్ ఎన్టీఆర్ కి పోటీగా కోలీవుడ్ స్టార్ కార్తీ బరిలోకి దిగుతున్నాడా? సై అంటే సై అంటూ కార్తీ దూసుకొస్తున్నాడా? అంటే అవుననే తెలుస్తోంది. ఇప్పటికే యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'దేవర' భారీ అంచనాల మధ్య సెప్టెంబర్ 27న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే బాగా ఆలస్యమైన నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లో ఆ తేదీకి విడుదల చేయాలని కొరటాల పట్టు మీద పని చేస్తున్నారు. 'ఆర్ ఆర్ ఆర్' తర్వాత తారక్ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చి కూడా సంవత్సరాలు గడుస్తోంది. దీంతో అభిమానులు తారక్ కోసం ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఎట్టి పరిస్థితుల్లో 'దేవర' మొదటి భాగాన్నీ ఆ తేదీకి తీసుకొచ్చేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 'దేవర' ఆ తేదీ లాక్ చేసుకోవడంతో చాలా సినిమాలు వాయిదా పడ్డాయి. పాన్ ఇండియా సినిమాతో పోటీ పడితే నష్టం తప్పదని ఇతర హీరోలంతా వెనక్కి తగ్గారు. అయితే సరిగ్గా ఇదే తేదీకి కోలీవుడ్ స్టార్ కార్తీ హీరోగా నటిస్తోన్న 'మెయగళన్' అనే సినిమా రిలీజ్ చేసేందుకు రెడీ అవుతున్నారు. '96' ఫేం ప్రేమ్ కుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తమిళనాట ఫేమస్ అయిన జల్లికట్టు నేపథ్యం కూడా ఉంది. జల్లికట్టు సన్నివేశాలు సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని యూనిట్ చెబుతుంది. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్లు..ప్రచార చిత్రాలు సినిమాకి మంచి హైప్ తీసుకొచ్చాయి. ఈ సినిమాకి కూడా సెప్టెంబర్ 27న రిలీజ్ తేదీగా మేకర్స్ భావిస్తున్నారు. తమిళనాట 'దేవర'కి..తెలుగు నాట కార్తీ సినిమాలపై ఎఫెక్ట్ పడుతుందన్నది ఒక వెర్షన్ అయితే. రెండు సినిమాలకు థియేటర్లను పర్ఫెక్ట్ గా బ్యాలెన్స్ చేసి..హిట్ టాక్ తెచ్చుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదన్నది మరో వెర్షన్. కార్తీకి తెలుగు మార్కెట్ ఉన్న హీరో. అతడి సినిమాలకు ప్రత్యేకమైన అభిమానులున్న సంగతి తెలిసిందే.

# రావు గోపాలరావు కళాక్షేత్రాన్ని సందర్శించిన శాసనసభ్యుడు కొణతాల





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ రావుగోపాలరావు కళాక్షేత్రాన్ని శనివారం సందర్శించి కళాక్షేత్రం పరిస్థితిని పరిశీలించారు. గత ప్రభుత్వంలో ప్రజలకి అందుబాటులో లేకుండా పోయిన ఈ కళాక్షేత్రాన్ని మరలా తిరిగి ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఎన్నికల ముందు కొణతాల మాటిచ్చిన విషయం అందరికీ తెలిసిందే. ఇచ్చిన మాటకి అనుగుణంగా ఆకస్మికంగా రాగోపాల రావు కళాక్షేత్రాన్ని సందర్శించడం జరిగింది .విశాఖ మెట్రోపాలిటన్ కమిషనర్ రవీంద్ర , డి ఈ రవి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింగ్ , సీఈ సంజీవ్ తో కూడిన ప్రభుత్వ అధికారుల బృందంతో కళాక్షేత్రంలో పర్యటించి మరమ్మతులు చేసి ప్రజలకి అందుబాటులోకి తీసుకు రావడంపై మాజీ శాసనసభ్యులు, అనకాపల్లి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పీల గోవింద సత్యనారాయణ తో కలిసి సూచనలు చేశారు. త్వరితగతిన రావుగోపాలరావు కళాక్షేత్రం కు పూర్వవైభవం తీసుకురావడం కోసం ఆదేశాలను కూడా జారీ చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర , జనసేన పార్టీ నాయకులు పీలా నాగ శ్రీను (గొల్ల బాబు) , దూలం గోపి, మంగ ఈశ్వర్, వాకాడ బాబు, గొర్లి శేఖర్, రాజా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# 'సమత' కళాశాల ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ భక్తులకు సేవలు




ఆషాడ పౌర్ణమి సందర్భంగా సింహాచల క్షేత్ర గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులకు సమత కళాశాల మరియు హెల్పింగ్ హాండ్స్ ఎం.వి.పి కాలనీ వారి ఆధ్వర్యంలో భక్తులకు సేవలు అందజేశారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల నుంచే కాకుండా ఒడిస్సా రాష్ట్రం నుండి కూడా చాలామంది భక్తులు ఈ గిరిప్రదక్షినకు వస్తూ ఉంటారు. సుమారుగా 35 కిలోమీటర్ల పాటు సాగే ఈ గిరి ప్రదర్శన కు వచ్చిన భక్తుల సౌకర్యార్థం వారికి మంచినీరు నిమ్మరసం, బాదంపాలు,బిస్కెట్లు, పప్పు చక్కిలూ, మెడిసిన్, అందజేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల డీన్ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ .ఎస్. విజయ రవీంద్ర గారు, మరియు ఇన్చార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.శ్రీనివాసరావు, ఎం.బీ.ఏ హెచ్.ఓ. డి.జి. రమేష్, ఎన్.ఎస్.ఎస్ పి.ఓ లు డాక్టర్ .బి. రాజేష్ కుమార్, జి. రామకృష్ణ, వాలంటీర్లు పాల్గొన్నారు.

# పొందూరు ఖాదీపై వీడియో పోటీలు

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగష్టు 7న పొందూరు ఖాదీపై వీడియో పోటీలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర చేనేత మరియు జౌళి శాఖ కమిషనర్ శ్రీ కె. శ్రీకాంత్ ప్రభాకర్ శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రజల్లో చైతన్యం రగిలించడమే కాక స్వదేశీ వస్తు ఉద్యమంలో కూడా చేనేత వస్త్ర ఉత్పత్తి కీలక పాత్ర పోషించిందన్నారు. మహాత్మా గాంధీని ఎంతగానో ప్రభావితం చేసిన పొందూరు ఖాదీ వస్త్రాలు శ్రీకాకుళంనకు 25కి.మీ.ల దూరంలోని పొందూరు గ్రామంలో తయారు కాబడి నేటికీ ప్రసిద్ధి పొందుతున్నాయన్నారు. అందులో భాగంగా భారతీయ చరిత్రలో చేనేత యొక్క ప్రాధాన్యతకు గుర్తింపుగా 2015 నుంచి ప్రతి ఏటా ఆగష్టు 7న జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు.

**పొందూరు ఖాదీపై వీడియో పోటీలు**

ఈ ఏడాది జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పొందూరు ఖాదీ తయారీ పై 'వీడియో' పోటీలు నిర్వహిస్తాం దన్నారు. ఈ పోటీలో పాల్గొనదలచినవారు పొందూరు ఖాదీ వస్త్ర తయారీలోని అన్ని దశలను పొందుపరుస్తూ చక్కటి వీడియోను రూపొందించాలన్నారు. ఉత్తమ వీడియోకు నగదు పారితోషకం మరియు ప్రశంసా పత్రం అందించి ఘనంగా సత్కరించడం జరుగుతుందని తెలిపారు. ఉత్సాహవంతులైన వారు ఇతర వివరాలకు P. శ్రీనివాస రెడ్డి, సహాయ సంచాలకులు, ఫోన్ నెం. 9492344466, కమిషనర్ కార్యాలయం, చేనేత మరియు జౌళి శాఖ, 4వ అంతస్తు, IHC కార్పోరేట్ బిల్డింగ్, మంగళగిరి, గుంటూరు జిల్లా వారిని 2024 జులై 26 తేదీ లోగా సంప్రదించి తమ వీడియోలను ఆగష్టు 1వ తేదీలోగా సమర్పించాలని రాష్ట్ర చేనేత మరి యు జౌళి శాఖ కమిషనర్ కె. శ్రీకాంత్ ప్రభాకర్ అన్నారు.

# గుల్లలమోద క్షిపణి పరీక్ష కేంద్రం తరలిపోకుండా చూడండి




టెస్టు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న నిపుణులు

**మచిలీపట్టణం, (ఆర్ఎన్ఐ):** కృష్ణా జిల్లా మచిలీపట్టణం తీరము నుండి షుమారు 30కి. మీ దూరంలో వెయ్యికోట్ల వ్యయంతో 200ఎకరాల వరకు విస్తీర్ణంలో నిర్మాణంలా వున్న క్షిపణి పరీక్ష కేంద్రం పనులు నిలిపివేయటానికి కారణాలు కనుగొని పరిష్కరించి దేశంలోనే పొరుగు రాష్ట్రము ఒరిస్సా లోని బాలసోర్ తరువాత రెండవది అయిన ఈ గుల్లలమొద క్షిపణి పరీక్ష కేంద్రం తరలిపోకుండా తిరిగి పనులు మొదలయ్యేలా చూడాలని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ని, మచిలీపట్టణం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలసౌరిని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిష్టాత్మకమైన ఈ కేంద్రానికి భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ , ఆగష్టు 26, 2019న శ్రేణి శంకుస్థాపన చేశారు.

ఈ స్వల్ప-శ్రేణి మరియు దీర్ఘ-శ్రేణి క్షిపణి మిషన్‌లకు పూర్తి స్థాయి పరీక్ష లక్ష్యంగా ఇది ప్రయోగ నియంత్రణ కేంద్రం, కొన్ని లాంచ్ ప్యాడ్‌లు, బ్లాక్‌హౌస్ మరియు అత్యాధునిక కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌తో పాటు టెలిమెట్రీ మరియు ఎలక్ట్రో-ఆప్టికల్ ట్రాకింగ్ కోసం శాశ్వత పర్యవేక్షణ స్టేషన్‌లను కలిగి ఉండేలా "డి ఆర్ డి ఓ " మూడు సంవత్సరాలలో ఈ ప్రాజెక్ట్ పూర్తి చెయ్యాలనే లక్ష్యాన్ని నిర్ణయించింది.ఆమెరకు 2022 ఆగస్టులోనే ఇది పూర్తి అయ్యి క్షిపణి పరీక్షకోసం సిద్ధం కావాల్సింది.

మొదటి దశలో చాలాకాలం క్రితమే ఈ కేంద్రానికి చుట్టూ ప్రహరీ గోడ, పరిపాలన భవనాల నిర్మాణం ,సెక్యూరిటీ భవనం నిర్మాణం జరిగింది.కమ్మనమోలు వద్ద సిబ్బంది క్వార్టర్ల నిర్మాణంకూడా పూర్తీ కావచ్చినట్లు తెలిసింది. ఈ నిర్మాణలను విశాఖపట్నం కి చెందిన ఒక కనస్ట్రక్షన్ కంపెనీ చేపట్టింది. అయితే ఈ నిర్మాణప్రాంతానికి మెరకకోసం బుసకతోలే పనిలో తమకు కూడా వాటా కావాలని కోరిన సంబంధంలేని వారకి కాంట్రాక్టర్కి వచ్చిన విభేదముతో విసుగుచెందిన కాంట్రాక్టర్ పనిని నిలిపివెయ్యటంతో మొదటి విడత నిర్మాణం పనులు చివరలో ఆపివేసినట్లు అప్పట్లో బుసక తోలిన ట్రాక్టర్ డ్రైవర్లు కార్మికుల వలన తెలుస్తోంది.

దీనితో రక్షణశాఖ కూడా ఇలాంటి చోటపెట్టి తలనొప్పి తెచ్చుకునే బదులు మరోచోటికి తరలించే యోచన ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఇదే నిజమైతే జల్లాకు వచ్చిన ప్రతిష్టస్కారమైన అంతర్జాతీయంగా ప్రపంచ పటంలో నిలవాల్సిన కృష్ణా జిల్లాకు దురదృష్టకరమనే చెప్పాలి.

కనుక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్కళ్యాణ్ ల సహకారంతో అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, మచిలీపట్టణం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలసౌరి లు తిరిగిప్రయత్నించి ఏ ప్రతిష్టాత్మకమైన గుళ్ళలమోద మిస్సయిల్ టెస్టు ఫైరింగ్ సెంటర్ ని తరలి పోకుండా చూడాలని జిల్లా ప్రజానీకం కోరుతోంది.









VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Kakinada (K.B. Ramarao): Cell: 9949413661, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Bheemili (D.V.Chalapathi Rao) : Cell: 9849603258, Office (Raghunath) : 7013785256. Arilova (D.Venkatesh) : 73825 85777. Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Yelamanchili (P.S.N. Murthy) : 83095 38789 Anakapalli (M.Krishna Rao) : 63023 75539
Paderu (P.Ravi Kumar) : 94908 12271 Parvathipuram (S.S.Naidu) : 94900 27519 Chintapalli (Srinivas) : 94923 40861 Chodavaram (BVR Murthy) : 81431 22188

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.